ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


5

శ్రీపొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 7 ఆగస్టు 2025





'సోమశిల'కు పెరిగిన వరద

అనంతసాగరం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. మంగళవారం 14,105 క్యూసెక్కులు వస్తుండగా బుధ వారానికి 15,461 క్యూసెక్కులకు చేరింది. దీంతో డ్యాం నీటిమట్టం 36.835 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నేతన్నకు ఊపిరి

- చితికిన చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- జీఎస్టీ మినహాయింపు, ఉచిత విద్యుత్ ప్రకటనపై నేతన్నల ఆనందం
- 'త్రిఫ్ట్ ఫండ్'తో ఆర్థిక తోడ్పాటు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

పొరుగు రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. పరుగు ప్రపంచంతో పోటీపడుతూ ఎదుగుతోంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటూ నమ్మినవారిని గట్టున పడేస్తోంది.

కానీ..

చేనేత... ఇందుకు పూర్తిగా విరుద్ధం. అగ్గి పెట్టెలో ఇమిడే చీరను నేసే నైపుణ్యం ఉన్నా నాలుగు రూపాయలు సంపాదించుకోలేని దైన్యం. కనీసం మూడు పూటలా పొట్టనింపుకోలేక నీళ్లు తాగిన రోజులు నేతన్నవి. కులవృత్తిని వీడలేక.. మరో పనికి వెళ్లలేక చెదలు పట్టిన.. పడుతున్న మగ్గం పట్టుకునే బతుకుబండి లాగుతున్నాడు. చేయి అందించి ఆదుకోవాల్సిన గత పాలకులు పూర్తిగా విస్మరించారు. ఉన్న సంక్షేమ పథకాలను తొలగించి, పన్నులపేరుతో మరింత కుంగదీశారు.

ఇప్పుడు..

ఆర్థికంగా చితికిపోయి బేలచూపులు చూస్తున్న నేతన్నకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ఉచిత కరెంటు, ఇతర పన్నులు తొలగించడంతోపాటు వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు.

సంగం, ఆగస్టు 6 : భారతీయ సంస్కృతి, సంప్రదాయంతో పెనవేసుకున్న చేనేత కళ పాలకుల అలసత్వం, చిన్నచూపు కారణంగా చేనేత రంగం రోజురోజుకు కునారిల్లుతోంది. స్వాతంత్ర్యోద్యమంలో 1905లో స్వదేశీ వస్తువుల వినియోగం, విదేశీ వస్తువులు బహిస్కరణకు నాంది పలికిన చేనేత నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2015లో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు. చేనేతను సంరక్షించడంతోపాటు నేతన్నకు ప్రయోజనం కల్పించి చేనేత దుస్తులు ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించేందు కోసమే ఈ దినోత్సవ లక్ష్యం. ఈ నేపథ్యంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం.

జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికంగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం సంగం, వింజమూరు, కోవూరు, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు. ఆత్మకూరు, ఏఎస్ పేట, కావలియడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో సుమారు 7 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 3,700 మగ్గాలు ఉండగా మరో వెయ్యి ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో సుమారు 7వేల మగ్గాలు ఉండేవి. ప్రభుత్వాల నిర్లక్ష్యంవల్ల పూట జరగడం కష్టమై చాలామంది నేతన్నలు మగ్గం మూలన పడేసి ఉపాధి హామీ పథకం, తాపీ, వంట పని ఇలా ఇతర పనులకు వెళ్తున్నారు. వీరు కాకుండా మరో 5వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు.



● గత ప్రభుత్వ నిర్వాకం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టీడీపీ హయాంలో చేనేతలకు అమలు చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసింది. కేవలం నేతన్న నేస్తంతో సరిపెట్టింది. ఫలితంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చేనేత ముడి సరుకులు, ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించింది. దీంతో ముడి నూలుపై రేట్లు పెరిగాయి. దీంతో పాటు ఉత్పత్తులపై కూడ జీఎస్టీ విధించడంతో నేతన్న నేసిన వస్త్రాలపై ధరలు పెరిగాయి. ధరల పెరుగుదల వల్ల ఉత్పత్తులకు మార్కెట్ పడిపోయింది. ఇంకేముంది... నేతన్నకు చేతినిండా పని కరువయ్యింది. ఫలితంగా కూలి రేట్లు తగ్గంతో నేతన్న ఆర్థిక ఊబిలో కూరుకుపోయాడు. దీని నుంచి గట్టెక్కేందుకు ఇతర వృత్తులకు వలస బాట పట్టారు.

రద్దు చేసిన పథకాలు

- ఐసీఐసీఐ బ్యాంకు లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకాన్ని పూర్తిగా ఆపేశారు. చేనేత కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాదిపాటు రూ.15 వేల వరకు ఆరోగ్య బీమా వర్తించేది. సాధారణంగా నేతన్నలు వృత్తిపరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఏ వైద్యశాలలో అయినా వైద్యం చేయించుకుని బిల్లు పెడితే రూ.15వేలు ఇచ్చేవారు.
- **బునకర్ బీమా యోజన :** ఈ పథకంలో రూ.80లకే ఇన్సూరెన్సు కల్పించేవారు. కుటుంబ యజమాని సాధారణ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు అయితే 1.5 లక్షలు ఇచ్చేవారు.
- **ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ స్కీం) :** చేనేత కార్మికుడికి నూలు కొనుగోలు కోసం ఈ పథకం ద్వారా 10 శాతం రాయితీ ఇచ్చేవారు.
- **ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) :** కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ.50 వేల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చేవారు.
- గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్ షెడ్డు కోసం రూ.75 వేల ఇచ్చేవారు.
- 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు టీడీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వైసీపీ వచ్చాక ఆ జీవో ఊసే లేదు.
- వైసీపీ హయాంలో కేవలం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి ఒక్కో చేనేతకు రూ.24 వేలు ఇచ్చేది. అయితే, అందులోనూ కోతలు విధించి, అర్హులను రోడ్డున పడేశారు.



చంద్రబాబు చేయూత

ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత నేతన్నకు 100 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలు చేశారు. ఇప్పటికే జిల్లాలో 2 వేల కుటుంబాలు ఉచిత కరెంటు పొందుతున్నాయి. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు. అదేవిధంగా చేనేత ముడి సరుకుల దిగుమతి, ఉత్పత్తులపై 5శాతం ఉన్న జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. అంతేకాదు నేతన్నల సంక్షేమ అభివృద్ధికి త్రిఫ్ట్ ఫండ్ పేరుతో రూ. 5 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

● త్రిఫ్ట్ ఫండ్‌తో ఆదాయం

ఈ పథకంలో చేనేత కార్మికుడు తన సంపాదనలో 8 శాతం నిర్ధేశించిన బ్యాంకు ఖాతాలో పొదుపు చేయాలి. ఆ తర్వాత ప్రభుత్వం రెండు రెట్లు విడుదల చేస్తుంది. ఉదాహరణకు ఒక కార్మికుడు నెలకు రూ.వెయ్యి పొదుపు చేస్తే ఏడాదికి రూ.12 వేలు అవుతుంది. ప్రభుత్వం రెండు రెట్లు ఇస్తుంది అంటే రూ.24 వేలు అవుతుంది. మొత్తం లబ్ధిదారుడికి రూ. 36 వేలు అవుతుంది. ఈ సొమ్మును మూడు నెలలకు ఒకసారి తన అవసరాలతోపాటు పెట్టుబడిగా ఉపయోగించుకోవచ్చు.

గత పథకాలన్నీ అమలు చేయాలి



సంక్షోభంలో ఉన్న చేనేతను ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు, జీఎస్టీ రాష్ట్ర ప్రభుత్వమే భరించడం హర్షదాయకం. త్రిఫ్ట్ ఫండ్ పథకంతోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను తిరిగి అమలు చేయాలి. కష్టాల్లో ఉన్న నేతన్నను ఆదుకోవాలి.

- బీ బాలాజీ, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



మాస్టర్ వీవర్స్ ఇచ్చే కూలిపై జీవనం కష్టంగా మారింది. గతంలోలా చేనేత క్లస్టర్లు, ముద్ర యోజన వంటి పథకాలు అమలు చేస్తే సొంతంగా మగ్గం నేసుకుంటాం. ఆదాయం పెరుగుతుంది. అంతేగాక గతంలో మాదిరి బునకర్ యోజనా, ఆమ్‌ఆద్మీ వంటి పథకాలు, 50 ఏళ్లు నిండిన ప్రతి ఒకరికీ పింఛన్ ఇవ్వాలి.

- పెంచలమ్మ, నేత కార్మికురాలు, సంగం

- మరికొందరు నేతన్నల అభిప్రాయాలు 7లో

కడలూరు, కారైకల్ బోట్లను కట్టడి చేద్దాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి
- నాలుగు జిల్లాల గంగపుత్రుల తీర్మానం
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లను సమష్టిగా కట్టడి చేద్దామని నాలుగు జిల్లాల మత్స్యకార పెద్దలు, కాపులు నిర్ణయం తీసుకున్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించిన తీర ప్రాంత మత్స్యకార గ్రామకాపులు, పెద్దలతో బుధవారం పొద్దుపోయాక నిర్వహించిన సమావేశంలో 160 మత్స్యకార గ్రామాలకు చెందిన గంగపుత్రులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కడలూరు, కారైకల్ బోట్లు అనుమతులు లేకుండా ఆంధ్ర సముద్ర తీరంలో మెటనైజ్డ్ హెవీ మోటర్ బోట్లతో అక్రమంగా చేపల వేట సాగించడాన్ని అరికట్టేందుకు తమ అభిప్రాయాలను తెలియచేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 31వ తేదీన ఇందుకూరుపేట మండలం కృష్ణాపురం వద్ద సముద్ర చేపల వేటకు కడలూరు మెటనైజ్డ్ హెవీ మోటర్ బోటు వచ్చిందని, స్థానిక మత్స్యకారులు ప్రాణాలకు తెగించి ఆ బోటును అడ్డగించి తీరం చేర్చుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తీరప్రాంత మత్స్యకార పెద్దలకు సమాచారం తెలియచేసి ఆగస్టు 1వ తేదీన కాపుల నిర్ణయం మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారులచే కడలూరు బోటులోని చేపల వేటకు వచ్చిన వారిని పంపించినట్లు తెలిపారు. అందరి నిర్ణయం మేరకు కడలూరు బోటును 2న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చామన్నారు. కడలూరు, కారైకల్ హెవీమోటర్ బోట్లను ఎదుర్కోవడానికి ఫైబర్ బోట్ల సామర్థ్యం చాలదని, అందరి సహాయ సహకారాలతో మెటనైజ్డ్ బోటుతో సముద్రంలో కాపలా కాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మెటనైజ్డ్ బోటు కొనుగోలు చేయాలంటే రూ.1.5 కోట్లకుపైగా అవుతుందని పెద్దలు అంటున్నారు. కడలూరు, కారైకల్ బోట్లను ఎదురించేందుకు రెండేళ్ల క్రితం అల్లూరు మండలం ఇస్కపల్లిలో మత్స్యకారాల సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సముద్ర చేపల వేటలో మనవారి ఫైబర్ బోట్లు, వలలను చాలాసార్లు ధ్వంసం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి కాబట్టి తమిళనాడు బోట్లను కడలూరు బోటుతోనే ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో అధికారులు మత్స్యకారులకు సహకరించాలని నాలుగు జిల్లాల గంగపుత్రులు కోరారు.



సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న మత్స్యకార పెద్దలు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

అపోహలు వద్దు..
ప్రభుత్వం ఆదుకుంటుంది!

- 5 సెంట్ల భూమి, అందులో ఇంటినీ నిర్మిస్తాం
- జీవనభృతి కోసం ఒక్కో కుటుంబానికి రూ.6.5 లక్షలు
- యథావిధిగా నష్టపరిహారం పంపిణీ
- ప్రత్యేక అధికారితో అనుమానాల నివృత్తి
- జీవో ప్రకారం 4800 ఎకరాల భూమి సేకరిస్తాం
- ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఆనంద్
- 80 మంది రైతులకు రూ.3 కోట్ల పరిహారం జమ

8లో..



ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన సబ్ కలెక్టర్ శ్రీపూజ

ఆగని దోపిడీ!

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు
- రైతుల పేరుతో మూడు చెరువుల్లో తరలింపు
- రియల్టర్లకు విక్రయిస్తున్న అక్రమార్కులు
- రాజకీయ ఒత్తిళ్లు, అధికారులకు మామూళ్లు



తుమ్మల పెంట రోడ్డులో వేస్తున్న లేఅవుట్‌కు తోలిన మట్టి



మట్టి సరిచేసిన తోలిన గ్రావెల్

కావలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా కావలిలో మాత్రం మట్టి, గ్రావెల్ దందా ఆగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులు, ప్రభుత్వ పొలాలు, పెద్ద పెద్ద తిప్పలు, చివరకు విమానాశ్రయ భూముల్లో సైతం గ్రావెల్‌ను కొల్లగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. అయితే, ఎన్డీఏ కూటమి హయాంలో అక్రమార్కుల ఆగడాలకు చెక్ పడిందని అనుకున్నా మరింత పేట్రేగిపోతున్నారు. చెరువుల్లో మట్టిని కొల్లగొట్టి రియల్టర్లకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు.

● రైతుల ముసుగులో..

కావలి మండలంలోని తాళ్లపాలెం, మన్నెంగిదిన్నె, కావలి పెద్ద చెరువులలో కొందరు రైతుల పేరుతో మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. వాస్తవంగా చెరువులలోని మట్టిని పొలాలకు తోలుకుంటే చేనుకు మంచి సత్తువ ఇస్తుంది. అది ప్రభుత్వ ఉద్దేశం కావటంతో క్యూబిక్ మీటరుకు ఒక రూపాయి వంతున ఆ మట్టిని రైతులు తోలుకునేందుకు నీటిపారుదల శాఖ అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే దానిని అడ్డం పెట్టుకుని కొంత మంది రైతుల పేరుతో అనుమతులు తీసుకుంటున్నారు. ఆ మట్టిని తీసుకెళ్లి లేఅవుట్లకు విక్రయిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అధికారులకు మామూళ్లు అందుతుండటంతో ఎవరూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా అక్కడకు వెళ్లి కొంతసేపు ఆపి ఆ తర్వాత వదిలేస్తుండటంతో ఈ అక్రమ మట్టి, గ్రావెల్ తరలింపులు యథేచ్ఛగా సాగుతోంది. గ్రావెల్‌కు అయితే ఎక్కడా అనుమతులు తీసుకోకుండానే రాత్రిళ్లు టిప్పర్లు పెట్టి అక్రమంగా తరలిస్తున్నారు. కావలి తాళ్లపాలెం చెరువు నుంచి ప్రతిరోజూ 60, 70 ట్రాక్టర్లు తుమ్మలపెంట రోడ్డులో ఆముదాలదిన్నె ప్రాంతంతో వేస్తున్న లేఅవుట్లకు మట్టిని తరలిస్తున్నాయి. తొలుత మట్టిని తోలి దానిని చదును చేసిన తర్వాత దానిపై గ్రావెల్ తోలి లేఅవుట్లను సిద్ధం చేస్తున్నారు.

● చోద్యం చూస్తున్న అధికారులు

పట్టపగలే లేఅవుట్లకు అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులకు రాజకీయ ఒత్తిళ్లతోపాటు ముడుపులు కూడా ముట్టుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఆ లేఅవుట్లు పంచాయతీ పరిధిలో ఉండటంతో వారికి కూడా ముడుపులు ముడుతున్నట్లు ప్రచారం ఉంది. వాస్తవంగా ప్రభుత్వానికి సీనరీ చెల్లించి లేఅవుట్లకు మట్టి, గ్రావెల్ తోలుకుంటే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ సీనరీ కట్టి మట్టి తోలాలంటే ఎక్కువ ఖర్చులు అవుతున్నాయని వాటిలో సగం అధికారులకు అందచేస్తే వారు రెండు రోజులు కళ్లు మూసుకుంటే ఆ లే అవుట్‌లో మట్టి తోలకం పూర్తి చేయవచ్చన్న భావనలో రియల్టర్లు ఉన్నారు. దీంతో అక్రమంగా తరలిస్తున్న మట్టి, గ్రావెల్‌ను అదుపు చేసే వారే కరువయ్యారు.

లేఅవుట్లను విక్రయిస్తే చర్యలు

రైతుల పొలాల కోసం మట్టి తోలకానికి అనుమతులు తీసుకుని లేఅవుట్లకు తోలితే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి అక్రమంగా మట్టి తరలింపును అడ్డు కోవటమే కాక అవసరమైతే వారిపై కేసులు పెడతాం.

- ఎం. సన్నీ వంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

ఎవరూ అనుమతులు తీసుకోలేదు

కావలి డివిజన్‌లో వ్యాపార అవసరాల కోసం మట్టి, గ్రావెల్‌కు ఎవరూ అనుమతులు తీసుకోలేదు. కావలి మండలంలో తాళ్లపాలెం, మన్నెంగిదిన్నె, కావలి పెద్ద చెరువులలో రైతుల పొలాలకు తోలుకునేందుకు మాత్రమే కొందరు అనుమతులు తీసుకున్నారు. గ్రావెల్‌కు ఎవరూ అనుమతులు తీసుకోలేదు. పొలాలకు అనుమతులు తీసుకుని వ్యాపారాలకు మట్టిని వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎం.ఖాన్, జలవనరులశాఖ, డీఈ, కావలి

sf | సుందరం హోమ్

నమోదిత కార్యాలయం : నం.21, పటుల్లాస్‌రోడ్, చెన్నై - 600002
కార్పొరేట్ కార్యాలయం : సుందరం టవర్స్, నం.46, వైట్స్ రోడ్, చెన్నై-600014, ఫోన్: 044-28515267
శాఖ కార్యాలయం : వార్డు నం.24-1, డోర్ నం.1676, బ్రహ్మానందపురం, దర్గామిట్ట, నెల్లూరు - 524003

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్షన్ 13(2)తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** అధీకృత అధికారి సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా రుణగ్రహీతను మరియు సహ-రుణగ్రహీతలను కోరుతూ **23.11.2022** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు.

సదరు చట్టబద్ధ కాలంలోగా మొత్తమును తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8కి అనుగుణంగా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను ఉపయోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 & 9 క్రింద దిగువ పట్టికలో పూర్తిగా వివరించిన ఆస్తి **"ఎక్కడ ఎలా ఉన్నదీ అక్కడ అలా", "అక్కడ ఏది ఉంటే అదే" మరియు "ఏది అక్కడ ఉంటే అది మాత్రమే" "ఎటువంటి అవలంబన లేని"** ప్రాతిపదికన **28.08.2025**న లేదా ఆలోగా 15:00 గం. వరకు ప్రజల నుండి సీల్డ్ బిడ్లు కోరడం ద్వారా విక్రయించబడునని ప్రజలకు ఇందుమూలంగా సమాచారం ఇవ్వడమైనది. వేలం అమ్మకంలో పాల్గొనగోరు వారు వారి బిడ్లను KYC డాక్యుమెంట్లతో పాటు సీల్డ్ కవర్లపై **Offer for Sale of Assets A/c. Mr. Bellamkonda Viswanatham** అని వ్రాసి, Authorised Officer, **Sundaram Home Finance Limited,** Ward No.24-1, Door No.1676, Braahmanandapuram, Dargamitta, Nellore - 524003 చిరునామాకు **28.08.2025**న 15.00 గం.కు లేదా ఆలోగా RPAD/HAND డెలివరీ ద్వారా మాత్రమే దిగువ సంతకందారుకు పంపవలెను. రుణ ఖాతా నం. **NEL20210019, Mr. Bellamkonda Viswanatham** కొరకు బయానా రిమార్కుతో ఖాతా పేరు: **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్,** కరెంట్ బ్యాంక్ ఖాతా నం: **00040350000905,** బ్యాంక్ పేరు: HDFC BANK LTD, ITC Centre - Anna Salai, Chennai - 600002, ఖాతా - కరెంట్ ఖాతా, IFSC CODE - HDFC0000004కు చెల్లించబడిన RTGS వివరాలతో లేదా మొత్తం బయానా కొరకు **SUNDARAM HOME FINANCE LTD** పేరున DD ద్వారా బిడ్లు స్వీకరించబడతాయి. **28.08.2025**న 15:00 గం. తరువాత అందిన బిడ్లు తిరస్కరించబడును. **28.08.2025**న 15:00 గం. వరకు RPAD/HAND డెలివరీ ద్వారా స్వీకరించబడిన సీల్డు బిడ్లు దిగువ తెలిపిన ప్రదేశం వద్ద **28.08.2025**న 15:30 గం.కు తెరువబడును. గెలుపొందిన బిడ్డరు అమ్మకం నిర్ధారణ స్వీకరించిన తేదీ నుండి 15 రోజులలోగా మిగతా మొత్తాన్ని చెల్లించవలెను. పైన తెలిపిన విధంగా మిగతా మొత్తం డిపాజిట్ చేసిన తరువాత మాత్రమే అమ్మకం పూర్తి చేయబడును.

రుణగ్రహీత & సహ-రుణగ్రహీత & న్యాయవారసుల పేరు మరియు చిరునామా	సెక్యూర్డ్ రుణం (రూ.)	ఆస్తి కొరకు నిర్ణయించబడిన రిజర్వు ధర	టైటిల్ పరిశీలన ప్రదేశం
శ్రీమతి సంధ్యారాణి బెల్లంకొండ (సహ-రుణగ్రహీత) న్యాయవారసులు సహిత భర్త స్వర్గీయ శ్రీ బెల్లంకొండ విశ్వనాథం, ఫ్లాట్ నం.102, 1వ అంతస్తు, ఎస్.వీ.డిగ్రీ కళాశాల దగ్గర, మైత్రి నిలయం, దేవిపాలెం గ్రామం, పశ్చిమ గూడూరు, గూడూరు మండలం, నెల్లూరు-524101. మరియు: న్యాయ వారసురాలు సహిత భర్త స్వర్గీయ శ్రీ బెల్లంకొండ విశ్వనాథం, డోర్ నం.1-554-13, తిలక్ నగర్, సిరామిక్ కాలేజ్ దగ్గర, గూడూరు, నెల్లూరు - 524101 **శ్రీమతి సంధ్యారాణి బెల్లంకొండ (ఆస్తి) న్యాయవారసులు సహిత భర్త స్వర్గీయ శ్రీ బెల్లంకొండ విశ్వనాథం,** ఫ్లాట్ నం.73, 74, 75 మైత్రి నిలయం, ఫ్లాట్ నం.102, 1వ అంతస్తు, ఎస్.వి.డిగ్రీ కళాశాల దగ్గర, మైత్రి నిలయం, దేవిపాలెం గ్రామం, పశ్చిమ గూడూరు, గూడూరు మండలం నెల్లూరు - 524101 **కుమారి బెల్లంకొండ గీత, న్యాయవారసులు సహిత తండ్రి స్వర్గీయ శ్రీ బెల్లంకొండ విశ్వనాథం,** ఫ్లాట్ నం. 102, 1వ అంతస్తు, ఎస్.వీ.డిగ్రీ కళాశాల దగ్గర, మైత్రి నిలయం, దేవిపాలెం గ్రామం, పశ్చిమ గూడూరు, గూడూరు మండలం, నెల్లూరు - 524101 **కుమారి బెల్లంకొండ శ్రావణి, న్యాయవారసులు సహిత తండ్రి శ్రీ బెల్లంకొండ విశ్వనాథం,** ఫ్లాట్ నం. 102, 1వ అంతస్తు, ఎస్.వీ.డిగ్రీ కళాశాల దగ్గర, మైత్రి నిలయం, దేవిపాలెం గ్రామం, పశ్చిమ గూడూరు, గూడూరు మండలం, నెల్లూరు - 524101 **శ్రీ బెల్లంకొండ బాలాజి, (న్యాయవారసులు సహిత తండ్రి స్వర్గీయ శ్రీ బెల్లంకొండ విశ్వనాథం),** ఫ్లాట్ నం. 102, 1వ అంతస్తు, ఎస్.వీ.డిగ్రీ కళాశాల దగ్గర, మైత్రి నిలయం, దేవిపాలెం గ్రామం, పశ్చిమ గూడూరు, గూడూరు మండలం, నెల్లూరు - 524101	07.08.2025 నాటికి **రూ.47,42,150/-** (రూపాయలు నలభై ఏడు లక్షల నలభైరెండు వేల నూటయాభై మాత్రమే)తో పాటు తదుపరి వడ్డీ మరియు వాస్తవిక చెల్లింపు తేదీ వరకు ఏవేని ఇతర చార్జీలు మొదలైనవి	రూ. **29,00,000/-** (రూపాయలు ఇరవైతొమ్మిది లక్షలు మాత్రమే) **బయానా:** బిడ్ మొత్తంలో 25%	సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వార్డు నం.24-1, డోర్ నం.1676, బ్రహ్మానందపురం, దర్గామిట్ట, నెల్లూరు - 524003 **బిడ్ తెరుచు ప్రదేశం** సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ వార్డు నం.24-1, డోర్ నం.1676, బ్రహ్మానందపురం, దర్గామిట్ట, నెల్లూరు - 524003 **బిడ్ తెరుచు తేదీ మరియు సమయం** **28.08.2025న 15:30 గం.**

సెక్యూర్డ్ ఆస్తి వివరణ: షెడ్యూలు-ఏ: గూడూరు ఉప జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు మండలం, వెస్ట్ గూడూరు గ్రామం, ఇంతకుముందు దేవిపాలెం గ్రామ పంచాయతి, ప్రస్తుతం గూడూరు మున్సిపాలిటీ ఏరియా, 600 చ.గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్ నంబర్లు 73, 74, 75, సర్వే నంబర్లు 522-బి3బి, 522/బి2, 522/బి3ఎ, 520-ఎ2లో కలిగి ఉన్న ఆస్తి యావత్తు **సరిహద్దులు: అపార్ట్‌మెంట్ సరిహద్దులు:** ఉత్తరం: ప్లాట్ నం.45, దక్షిణం: లేఅవుట్ రోడ్, తూర్పు: ప్లాట్ నం.34, 80 & 81, పశ్చిమం: లేఅవుట్ రోడ్డు; **షెడ్యూలు-బి:** మైత్రి నిలయం, 1500 చ.అ. కొలతలు గల (కామన్ ఏరియా కలుపుకొని) మొదటి అంతస్తులోని ఫ్లాట్ నం.102, ఎ-షెడ్యూల్‌లోని తెలిపిన 600 చ.గజాల మొత్తం విస్తీర్ణంలో 66.66 చ.గజాల ఖాళీ స్థలం యొక్క అవిభాజ్య వాటా దామాషా ఫ్లాట్ యొక్క అన్ని సౌకర్యాలతో **ఫ్లాట్ సరిహద్దులు:** ఉత్తరం: ఖాళీ మరియు లిఫ్ట్, దక్షిణం: మెట్లు మరియు ఖాళీ, తూర్పు: కామన్ కారిడార్, పశ్చిమం: ఖాళీ; SRO గూడూరు వద్ద నమోదైన సేల్ డీడ్ నం.4305/2020లో మరింత స్పష్టంగా పూర్తిగా వివరించబడింది.

గమనిక: కాగోరు కొనుగోలుదారులు డాక్యుమెంట్లను పరిశీలించుకొని ఆస్తిని తనిఖీ చేసుకొని మరియు ఆస్తికి సంబంధించిన టైటిల్, స్వభావం మరియు స్థితి గురించి సంతృప్తి చెందిన తరువాత వేలంలో పాల్గొనాలని కోరబడుచున్నారు. ఆస్తి టైటిల్ లేదా స్వభావానికి సంబంధించి ఏదేని వివాదం తలెత్తే విషయంలో అమ్మకం నిర్ధారణ తరువాత రిఫండ్ ఇవ్వబడదు.

శ్రీ విశ్వనాథం బెల్లంకొండ రుణ ఖాతా నం. **NEL20210019** అస్తి అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు రిఫర్ చేయండి: **www.sundaramhome.in/uploads/files NEL20210019/sale notice/.pdf**

సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ గిరిరాజ్ - **9553441464**

తేది: **07.08.2025**

సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
అధీకృత అధికారి తరపున

'ఈదూరు' నియామకంపై హర్షం

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఈదూరు పద్మాకర్ జాతీయ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ ఇన్‌చార్జి నియమితులు కావడం సంతోషదాయకమని జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు (పెద్ద అల్లాభక్షు) హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బుచ్చిలో ఆయన పలువురు స్నేహితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బుచ్చికి చెందిన పద్మాకర్ కర్నూలుకు వెళ్లి అక్కడ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసి నర్సింగ్ కాలేజీలకు స్టేట్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9617
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

రుచించని మధ్యాహ్న భోజనం

- 2 రోజులు సన్నాలు.. 4రోజులు రేషన్ బియ్యంతో వంట
- ముద్ద ముద్దలుగా మధ్యాహ్న భోజనం
- గుడ్లు, కూరలు కూడా అంతంత మాత్రమే
- పురుగులు పట్టిన రైస్‌కు మిల్లులో రీసైక్లింగ్
- గత నెల 27 నుంచి ఇదే తంతు
- రేబాల హైస్కూల్‌లో ఇదీ పరిస్థితి !

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకంలో రాష్ట్రమంతా అన్నీ పాఠశాలల్లో ఫోర్టిఫైడ్ (సన్నాలు)బియ్యంతో భోజనం పెడుతున్నారు. అయితే మండలంలోని రేబాల హైస్కూల్లో మాత్రం రెండు రోజులు ఫోర్టిఫైడ్ బియ్యం, మిగతా నాలుగు రోజులు రేషన్ బియ్యంతో భోజనం పెడుతున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 27 నుంచి జరుగుతున్న ఈ తంతుపై హెచ్ఎంను ప్రశ్నించగా, ఉన్నతాధికారుల అనుమతి తీసుకునే ఆ బియ్యం పెడుతున్నామని చెప్పారు. అయితే వేసవి సెలవులకు ముందు వరకు పాఠశాలల్లో విద్యార్థులకు రేషన్ బియ్యం అన్నం పెట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు పౌష్టికాహారం కలిగిన(ఫోర్టిఫైడ్)సన్నాల బియ్యంతో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. తగ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభించేందుకు 2రోజులు ముందే పౌష్టికాహార(సన్నాలు) బియ్యాన్ని ప్రభుత్వం అన్ని పాఠశాలలకు చేర్చింది అప్పటి నుంచి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యంతో భోజనం పెడుతుంటే రేబాలలోని పీఆర్ఎం జడ్పీ హైస్కూల్లో మాత్రం మంగళవారం పులిహోర, గురువారం విజిటబుల్ బిర్యానీకి మాత్రమే ఫోర్టిఫైడ్ బియ్యంతో పెడుతున్నారు. మిగిలిన 4రోజులు రేషన్ బియ్యంతో భోజనం పెడుతుండడం విమర్శలకు దారితీసింది.

● రేషన్ బియ్యం ఎక్కడివి..?

హైస్కూల్లో రేషన్ బియ్యం ఎక్కడివనేది స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. స్కూలులో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టే ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి 150 గ్రాములు వంతున బియ్యం ఇస్తుంది. ఆమేరకు నిత్యం హాజరుశాతాన్ని బట్టి వంట నిర్వాహకులకు బియ్యం పంపిణీ చేయాల్సి వుంది. బియ్యం మిగిలితే వాటిని సంబంధితశాఖల అధికారులకు తిరిగి ఇవ్వాలి. రేబాల హైస్కూల్లో ఫోర్టిఫైడ్ సన్నాలను పక్కదారి పట్టించి రేషన్ బియ్యం పెడుతూ హెచ్ఎం చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హైస్కూల్ పక్కనే వున్న స్థానిక వైసీపీ నేత రైస్ మిల్లులో సన్నాల రకం బియ్యాన్ని తలపించేలా రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయించి ఆ బియ్యంతో విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. గత నెల 27నుంచి రోజుకు 17నుంచి 20 కేజీల మేర ఉపయోగించడం హెచ్ఎం అవినీతికి అద్దం పడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై హెచ్ఎం ఫణీష్‌కుమార్ మాట్లాడుతూ బియ్యం షార్టేజీ వల్ల రేషన్ బియ్యం వాడుతున్నట్టు చెప్పారు.

● గుడ్లు, కూరలు అసలు బాగా లేదు...

గుడ్లు, కూరలు అసలేమీ బాగాలేవు సార్... అన్నం ముద్దగా వుంది. గుడ్లు వాసన వస్తున్నాయి... అని విద్యార్థులు పేర్కొన్నారు. తినలేక డస్ట్‌బిన్‌లో కుళాయిల వద్ద పడేస్తున్నామని తెలిపారు. మంగళ, గురువారాల్లో అన్నం బాగుంటుంది. మిగతా రోజుల్లో బాగుండదు.



రేబాల హైస్కూల్లో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు





చెడిపోయిన కోడిగుడ్లు, ముద్దగా ఉన్న అన్నం

రేపటి నుంచి శ్రీగంగమ్మ తల్లి కొలువులు



పొదలకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంవీధిలో వెలిసిన గ్రామశక్తి శ్రీగంగమ్మతల్లి కొలువులు శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు, యాదవసోదరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం కుంకుమపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 2గంటలకు ఆచారం తెలియజేయుట, సాయంత్రం 3గంటలకు అమ్మవారికి పూజలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం అమ్మవారికి పూజలు, 11 గంటలకు పోతురాజు ముగ్గుకి దిష్టి తీర్పు, రాత్రి 7గంటలకు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పూజలు, 11గంటలకు అమ్మవారికి ముగ్గు దిష్టి తీర్పు, మధ్యాహ్నం 2గంటలకు బోనాల ఊరేగింపు, 2.30గంటలకు గ్రామ పొంగళ్లు నిర్వహణ ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

వెంకటాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి ఎస్సీ కాలనీకి వెళ్లే సిమెంటు రోడ్డు ఆక్రమణకు గురైందని బుధవారం డీపీవోకు రిపబ్లికన్ పార్టీ (ఆర్‌పీఐ) జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ఆక్రమణకు గురై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. వెంటనే స్పందించి ఆక్రమణలకు గురైన రోడ్ల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

కవల విద్యార్థినులకు సన్మానం

విడవలూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు అల్లూరు రాధ (బీ. ఎస్సీ), అల్లూరు లక్ష్మీ (బీ.ఏ) ఇటీవల వెలువడిన పోలీస్ రిక్రూట్‌మెంట్ ఫలితాల్లో ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుజాత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు కళాశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు.

ప్రహరీని ఢీకొన్న మినీ లారీ

రాపూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో వస్తున్న మినీ లారీ అదుపు తప్పి ఇంటి ప్రహరీని ఢీకొంది.ఈ ఘటన రాపూరు మండలం ఓబులాయపల్లి గ్రామ సమీపాన జరిగింది. తమిళనాడు నుంచి ఉదయగిరికి టెంకాయల లోడుతో వెళ్తున్న మినీ లారీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఓబులాయపల్లిలో హైవే రహదారి పక్కనే ఉన్న జయమ్మ ఇంటి ప్రహరీ గోడను ఢీకొనగా గోడ దెబ్బతింది.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మనుబోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు మాదకద్రవ్యాల నిషేధంపై మండలంలోని అక్కంపేట, పిడూరు పాఠశాలల్లో అవగాహన కల్పించారు. అలాగే ఆడపిల్లలకు ప్రత్యేకంగా గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్ కార్యక్రమం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు లక్ష్మీ, కానిస్టేబుల్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

జయ హర్షకు డాక్టరేట్ ప్రదానం



జయ హర్షకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని ఎం ఎడెలిన జయ హర్షకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. నగరంలోని ఓల్డ్ మిలిటరీ కాలనీకి చెందిన ఎం ఎడెలిన జయ హర్ష బయోటెక్నాలజీ విభాగంలో మార్ఫోమెట్రిక్ అండ్ మాలిక్యూలర్ స్టడీస్ ఆఫ్ సెలెక్టెడ్ లూట్జానిడ్స్ కలెక్టెడ్ ఫ్రం ది ఈస్ట్ కోస్ట్ బెల్ట్ ఆఫ్ ఇండియా అనే అంశంపై సమగ్ర పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు డాక్టర్ కేవీఎల్ శ్రీకన్యరావు మార్గదర్శకత్వం వహించారు. తూర్పు తీర ప్రాంతాల్లోని సముద్రజల జీవాలలో ఒక ముఖ్యమైన జాతి అయినా లుట్జానిడ్స్‌పై భౌతిక నిర్మాణ విశ్లేషణ, అణుస్థాయి అధ్యయనం చేయడం ద్వారా విలువైన సమాచారాన్ని సమకూర్చారు. దీంతో బుధవారం వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ మధుమతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ సుజయ్‌కుమార్ కలిసి ప్రత్యేకంగా ఎడెలిన జయ హర్షను అభినందించారు.

పొటాష్, భాస్వరం కరిగితే
ఎరువుల వాడకం తగ్గుతుంది



మనుబోలు పొలాల్లో వ్యవసాయాధికారులు

మనుబోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): భూమిలో ఉన్న పొటాష్, భాస్వరం కరిగితే సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మనుబోలు-1 రైతుసేవా కేంద్రంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పొలాల్లోకి వెళ్లి క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూమిలో పొటాష్, భాస్వరం కరగని స్థితిలో అంటే సాగుకు ముందు దున్నే సమయంలో 20కేజీల పశువుల పేడలో ఎకరానికి 500ఎంఎల్ చొప్పున ఫాస్ఫో సాల్యుబలైజింగ్, పొటాష్ సాల్యుబలైజింగ్ బ్యాక్టీరియాను పిచికారి చేయాలన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం సాయం రైతుల ఖాతాల్లోకి వచ్చిందా, లేదా రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ. కే. శివ, షిఫరీస్ అసిస్టెంట్ కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

● యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): వేరుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే రైతులకు అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అనిత తెలిపారు. ముదివర్తి గ్రామంలో బుధవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా వేరుశనగలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మీ, వీఏఏలు సాయి లక్ష్మీ, వెన్నెల, పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

మనుబోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా తడి, పొడిచెత్తను సేకరించితే, గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉంటాయని డీఎల్‌పీవో వీ. రమణయ్య అన్నారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో తడి,పొడిచెత్త సేకరణను బుధవారం ఆయన పరిశీలించారు. ఇళ్లనుంచి చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. ఇళ్లనుంచి తీసుకెళ్లిన చెత్తను డంపింగ్ యార్డుకు చేర్చి, అక్కడ వర్మికంపోస్టు తయారు చేయించాలని కార్యదర్శి చెంచమ్మకు సూచించారు. చెత్త సేకరణపై ప్రభుత్వం ప్రజాభిప్రాయం తీసుకుంటున్నదన్నారు. కావున కార్యదర్శులు విధిగా నిత్యం సిబ్బందిచే చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సామగ్రి తరలింపును అడ్డుకున్న యజమాని

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): సచివాలయంలోనుంచి ఫర్నిచర్, కంప్యూటర్లు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బందిని సచివాలయ భవన యజమాని అడ్డుకున్నారు. ఈ సంఘటన బుధవారం బుచ్చి ఇరిగేషన్ బంగ్లా వెనుక ఉన్న సచివాలయం వద్ద చోటుచేసుకుంది. దీంతో కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దగ్గరుండి తాళాలు పగలగొట్టి సచివాలయంలోని కంప్యూటర్లు, ఫర్నిచర్‌ని నగర పంచాయతీ భవనం వద్ద ఉన్న సచివాలయానికి తరలించారు. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా గత డిసెంబర్‌లో అప్పటి కమిషనర్ అద్దె చెల్లించారు. ఆ సమయంలో భవనం యజమాని సచివాలయానికి తాళం వేసుకుంది. అప్పటి నుంచి సచివాలయంలోనే ఫర్నిచర్ ఉన్నట్టు తెలిపారు. బుధవారం ఆ భవనంలోని సామాన్లు తరలింపునకు యజమాని ససేమిరా అనడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి, కంప్యూటర్లు తీసుకొచ్చినట్టు కమిషనర్ తెలిపారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు : సోమిరెడ్డి



అన్న క్యాంటీన్ పనుల ప్రారంభానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులో బుధవారం అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనుల ప్రారంభానికి ఆయన పూజలు నిర్వహించారు. రూ.65లక్షలతో అన్నక్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసి, రూ.5లకే టిఫిన్, భోజనం అందించనున్నామన్నారు. ముత్తుకూరు ప్రాంతంలో పెద్దసంఖ్యలో కార్మికులు ఉన్నారని, స్థానికులతోపాటు కూలీల ఆకలిని ఈ అన్న క్యాంటీన్ తీర్చనున్నదని ఆయన పేర్కొన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా ముత్తుకూరు పంచాయతీని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎస్‌ఈఐఎల్ సంస్థ ఇప్పటికే పీహెచ్‌సీల్లో 40 మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. పామాయిల్ పరిశ్రమల ద్వారా పీ-4లో భాగంగా గ్రామాల్లో వెనుకబడిన గిరిజన కాలనీల దత్తతకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా గొల్లవీధి గిరిజనకాలనీలో సోమిరెడ్డి పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు ఈదూరు రాంప్రదీప్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కొత్తపల్లి రమేష్, రాగల శివకృష్ణ, అక్కయ్యగారి ఏడుకొండలు, బొలిగర్ల శ్రీనివాసులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు పద్ధతి మార్చుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ మైనారిటీ నాయకుడు జమీర్‌బాషా

పొదలకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కొనసాగించిన అరాచక పద్ధతులను వైసీపీ నాయకులు ఇప్పటికైనా మానుకోవాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జమీర్‌బాషా హితవు పలికారు. రెండురోజుల క్రితం పొదలకూరు శ్రీహరికాలనీలో టీడీపీ నాయకుడు బాబులు ఇంటిపై వైసీపీ మూకలు రాళ్లతో దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న మైనారిటీ నాయకులు జమీర్‌బాషా, ఖాదర్‌బాషా, మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, ఇతర నాయకులు డేగా యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళీరెడ్డి, అట్లూరి అనీల్‌కుమార్‌రెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు తమ పాత పద్ధతులను, అరాచకాలను ఇకనైనా మార్చుకోవాలని తెలిపారు. ఇళ్లపై దాడులు చేయడం, ఇంట్లో ఆడవాళ్లను అసభ్యకర పదజాలంతో మాట్లాడడం మంచిది కాదన్నారు. అనంతరం బాబులు మాట్లాడుతూ జరిగిన విషయాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన ఇంటిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.


సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు నరసాపురం విద్యార్థినులు



సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, పాఠశాల కమిటీ ఛైర్మన్

ఇందుకూరుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం ఎంవీఆర్‌ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఈ.ప్రసన్న, పీ.జ్యోతి ఈ నెల 9, 10, 11తేదీల్లో బాపట్లలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హెచ్ఎం పీ.నాగేశ్వరరావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, సిబ్బంది గ్రామస్థులు తదితరులు వారిని అభినందించారు.

అన్యాక్రాంత భూములను ఆలయానికి అప్పగించండి



తహసీల్దారు స్వప్నకు ఫిర్యాదు చేస్తున్న ఈవో భాస్కర్‌రెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన ఈపూరులోని విరూపాక్షస్వామి ఆలయ భూములను తిరిగి అప్పగించాలని ఆలయ ఈవో భాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు స్వప్నకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈపూరు గ్రామంలోని పలు సర్వే నెంబర్లలో విరూపాక్ష స్వామి దేవస్థానానికి 58.20 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే ఆలయ ధర్మకర్త దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయాంలో దాదాపు 26.52ఎకరాల భూమిని తన బంధువుల పేరు మీద అన్యాక్రాంతం చేసినట్లు ఈవో పేర్కొన్నారు. వన్ బీ రికార్డులో అన్యాక్రాంతమైన ఈ భూముల నమోదును మార్చి ఆలయానికి భూములు అప్పగించాలని కోరారు. ఇందుకు సంబంధించిన రికార్డులు అన్నింటినీ తహసీల్దారుకు అందజేశామని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

రాపూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలంలో ఉన్న గోనుపల్లి, మల్లమ్మగుంట వద్ద ఉన్న కరుణామయి విద్యా సంస్థల్లో బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం జరిగింది. యూనిఫామ్‌తోపాటు షూ, బెల్ట్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేసినట్లు గోనుపల్లి ప్రధానోపాధ్యాయుడు మస్తానయ్య, రాపూరు కరుణామయి ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య తెలిపారు ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వెంకటరాముడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

మద్యం షాపులో మందుబాబుల ఘర్షణ

● బీరు సీసాలతో దాడి, ఒకరికి తీవ్రగాయాలు



రక్త గాయాలైన నవీన్

కావలిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాలదిన్నెలో ఉన్న గౌడ మద్యం షాపులో బుధవారం మందుబాబులు ఘర్షణ పడ్డారు. బీరుబాటిళ్లతో దాడులు చేసుకోవడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ కామంచి నవీన్ అతని స్నేహితులు, పట్టణంలోని పాలెంకు చెందిన పెయింట్ పనులకు వెళ్లే పులి మల్లికార్జున్ మరో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా మద్యం దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో బీరు బాటిల్‌తో నవీన్ తలపై కొట్టడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని వైన్స్ షాపు నుంచి బయటకు పంపడంతో రోడ్డుపై మళ్లీ ఘర్షణకు దిగారు. ఈ విషయాన్ని వారి సంబంధీకులకు తెలపడంతో మల్లికార్జున్ స్నేహితులు అక్కడ నుంచి పరారుకాగా అక్కడకు చేరుకున్న నవీన్ బంధువులు మల్లికార్జున్ మోటారు బైక్‌ను అడ్డగించి అతనిపై దాడిచేసి అతని బైక్‌పైనే బలవంతంగా ఎక్కించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం అతని బంధువులు ఏరియా వైద్యశాలకు తరలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం



వృద్ధుడి మృతదేహం

కావలిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు మృతదేహాన్ని బుధవారం కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సు గల మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యంకాకపోగా గోధుమరంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, గ్రీన్‌కలర్‌పై పసుపు పూల డిజైన్ గల లుంగీ ధరించి ఉన్నాడు. చేతికర్ర, బూడిదరంగు కలర్ టవల్, బ్రౌన్‌కలర్ వాకర్ చెప్పులు వేసుకున్నాడు. ఎస్ఐ వెంకట్రావు మృతదేహాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

● ఆర్‌ఐకి గ్రామస్థుల వినతి

● కొనసాగుతున్న పోలీసు పహారా



ఆర్‌ఐకి వినతిపత్రాలు ఇస్తున్న గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో తెల్లరాయి తవ్వకాల అనుమతులు రద్దుచేయాలని గ్రామస్థులు రోజుల తరబడి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న విషయం విదితమే. దీంతో రెండు రోజులుగా పోలీసులు పహారా కాస్తున్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలు అందజేస్తారన్న సమాచారంతో పోలీసులు ముందస్తుగా వరికుంటపాడులో పహారా నిర్వహించడంతో ఆందోళనకారులు నివాసాలకే పరిమితమయ్యారు. బుధవారం సైతం వరికుంటపాడుతో సహా జంగంరెడ్డిపల్లి గ్రామాల్లోనూ పోలీసు పహారా కొనసాగుతున్నప్పటికీ ఆందోళనకారులు పోలీసుల కళ్లుగప్పి ఎవరికి వారుగా వివిధ మార్గాల్లో తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దారు లేకపోవడంతో గంటల తరబడి ఆయన కోసం ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేదేమిలేక కార్యాలయంలోని ఆర్ఐ అర్షద్ అహమ్మద్‌కు ఆయా గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా 85 వినతిపత్రాలను అందజేశారు. మా ప్రాణాలైనా వదులుతాం కానీ గ్రామాన్ని మాత్రం వదలం అనే నినాదంతో మైనింగ్ అనుమతులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్న తమను అడ్డుకునేందుకు ఎన్నడూలేని విధంగా పోలీసులు గ్రామాల్లో పహారా ఉంటుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా మైనింగ్ అనుమతులను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



వరికుంటపాడులో పోలీసుల పహారా

రెండు లారీల ఢీ : డ్రైవర్‌కి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు, ఒకటి రోడ్డుపై...రెండోది పొలాల్లో..

మనుబోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆ ప్రమాదం జరిగిన తీరు చూసి అంతా ఆశ్చర్యపోయారు. ఎవరో ఒకరు చనిపోయి ఉంటారనుకున్నారు. అయితే దైవాధీనం ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. దీంతో రెండు లారీల డ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు. మండలపరిధిలోని జాతీయరహదారిపై కొండూరుసత్రం సమీపంలో బుధవారం ఆగిఉన్న లారీని మరోలారీ ఢీకొంది. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నుంచి విజయవాడకు బ్యాటరీ లోడ్‌తో వెళుతున్న లారీ టైర్లు చెక్ చేసుకునేందుకు రోడ్డుపక్క ఆగింది. అదే మార్గంలో తమిళనాడు నుంచి ధాన్యం లోడుతో మేదరమెట్లలోని మిల్లుకు వెళుతున్న లారీ ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో ఆగిఉన్న లారీ రోడ్డుపక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఢీకొన్న లారీ క్యాబిన్ క్లీనర్ పక్క నుజ్జునుజ్జు అయింది. అయితే డ్రైవర్ సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.ఈ ప్రమాదంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్ఐ. శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెంపుడు కుక్కను చంపిన వ్యక్తిపై కేసు నమోదు

విడవలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కని చంపిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన వావిళ్ల గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వావిళ్ల గ్రామానికి చెందిన పాటూరు ఆదిలక్ష్మి కొద్ది రోజుల నుంచి పెంపుడు కుక్కని పెంచుకుంటుంది. ఏవ్వరైన కొత్తవారు వస్తే ఆ కుక్క అరుస్తూ ఉండేది. అయితే ఆ కుక్క అరుపులు నచ్చని ఎదురింటిలో నివాసం ఉంటున్న మడపర్తి సుదాకర్ ఇంటిలో కట్టివేసి ఉన్న కుక్కని దారుణంగా కొట్టి చంపేశాడు. ఈ మేరకు ఆదిలక్ష్మి పిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 475

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజె క్టు పరిధిలో 25 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అర్బన్ సీడీపీవో అరుణ ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 26వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను నెల్లూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు-2, అల్లీపురం- బీసీ, అల్లీపురం-2, అల్లీపురం-1, మేకలవారి తోట, వావిలేటిపాడు-ఎస్సీ, సౌత్‌మో పూరు-3, సౌత్‌మోపూ రు-బీసీ, ఎర్రకట్ట- హెచ్‌డబ్ల్యూ, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు-1, రామ్ నగర్-1, జనశక్తి నగర్, కొండాయపాళెం-1, నక్కలగుంట, నేతాజీ నగర్-3, అంబేద్కర్ నగర్-3, ఉయ్యాల కాలువకట్ట-1, ఇరగాళమ్మ సంఘం-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. నెల్లూరు అర్బన్ పరిధిలో శ్రీనివాసపురం, ఇసుకడొంక, తడికల బజారు-1, కపాడిపాళెం-3, రాయపు హరిజనవాడ-1, సరస్వతినగర్, ఎద్దలరేవు సంఘం-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఐటీఐలో యువత కోసం క్రాఫ్ట్స్‌మెన్ శిక్షణ

● కేంద్ర సహాయ మంత్రి రావ్ ఇందర్‌జిత్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో యువత కోసం క్రాఫ్ట్స్‌మెన్ శిక్షణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్ చెప్పారు. ఐటీఐల ఆధునికీకరణపై బుధవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా సమాధానం ఇచ్చారు.

విద్యార్థినుల అస్వస్థతపై విచారణ చేపట్టాలి

● ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ

నెల్లూరు(విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సోమవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయి జన్ కారణంగా 30 మందికిపైగా బాలికలు అనారోగ్యానికి గురవడం బాధాకరమన్నారు. పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు అందించడంలో అధికారుల వైఫల్యమే ఇందుకు కారణమని ఆరోపించారు. విద్యార్థినులు అనారోగ్యానికి గురైన వెంటనే వైద్య సహాయం అందించకుండా ఒకరోజు కాలయాపన చేయడం అన్యాయమన్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు విక్రమ్, నరేంద్ర, సహాయ కార్యదర్శి వంశీ, డీవైఎఫ్ఐ నాయకుడు టీవీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ టీపీఆర్వోగా వాసుబాబు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 6,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ టీపీ ఆర్వోగా ఎన్ వాసుబాబును నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది. రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయనను నెల్లూరుకు బదిలీ చేసింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న టీపీఆర్వో పోస్టు వాసుబాబు రాకతో భర్తీ కానుంది.

నేడు చేనేతల ర్యాలీ

● కలెక్టరేట్‌లో ఆప్కో స్టాల్ ప్రారంభం

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో చేనేత కార్మికులు, చేనేత సంఘాల ప్రతినిధులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందని, అనంతరం కలెక్టరేట్‌లో ఆప్కో స్టాల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత తిక్కన ప్రాంగణంలో నేత కార్మికులతో సమావేశం, నైపుణ్య చేనేత కార్మికులకు సన్మానం జరుగుతాయని తెలిపారు.

9న యజ్ఞోపవీతధారణ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 9వ తేదీ నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరుగుతుందని పండితుడు ఆలూరు శిరోమణిశర్మ ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ కార్యక్రమం నగరంలోని రేబాలవారి వీధి పోస్టాఫీసు ఎదురుగా ఉన్న భవనంపైన జరుగుతుందని తెలిపారు. నూతన యజ్ఞోపవీతధారణ కోసం గురువారం రాత్రిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మౌలానా గులాం రసూల్‌కు ఘన నివాళి

● జనాజాను మోసిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాయి వీధిలో ఉన్న అక్సా మసీదు, మదరసా నిర్వాహకుడు, తబ్లీఖ్ జమాత్ జిల్లా బాధ్యుడు మౌలానా గులాం రసూల్‌కు పలువురు ఘన నివాళులు అర్పించారు. గుండె వ్యాధితో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందారు. బుధవారం పార్థివదేహాన్ని కావలిలోని తన స్వగృహానికి తీసుకువచ్చారు. మృత దేహాన్ని స్థానికులు, స్థానికేతరులు వేలాదిగా తరలివచ్చారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విజయవాడ నుంచి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ముస్లిం సంప్రదాయంలో జనాజా నమాజ్‌లో పాల్గొని జనాజాను తన భుజాలపై మోశారు. అంతిమ యాత్రలో జిల్లా, రాష్ట్రంలోని మతపెద్దలు, ముస్లిం ప్రజలు, ఇతరులు పాల్గొని నివాళులర్పించారు.


ఆక్రమణలకు కేరాఫ్ కొత్తూరు

● ఆ ప్రాంతంలో రెచ్చిపోతున్న భూ మాఫియా
● సామాన్యుల భూములకు నకిలీ పట్టాల సృష్టి
● ఆపై రిజిస్ట్రేషన్... లేదంటే వివాదం ● కీలకంగా ఉన్న ఓ మాజీ కార్పొరేటర్ భర్త
● పోలీసు స్టేషన్‌లో వరుసగా కేసులు

● కొత్తూరులోని ఓ సర్వే నంబర్‌లో ఉన్న భూమిని కోవూరు మండలానికి చెందిన వ్యక్తులు 1999లో కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లు ఈసీలో కనిపిస్తున్నాయి. అయితే ఇదే భూమికి కొందరు వ్యక్తులు దొంగ పత్రాలు సృష్టించారు. హద్దులు చెరిపేసి ఆ భూమిని ఏకంగా లేఅవుట్‌గా మార్చి స్థలాల విక్రయాలు జరిపారు. అందులో నిర్మాణాలు చేపడుతుండగా విషయం తెలుసుకున్న అసలైన హక్కులుదారులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో పలువురి మీద కేసు నమోదైంది.

● కొత్తూరులోని టీచర్స్ కాలనీ లేఅవుట్‌లో ఓ ప్లాటును నగరానికి చెందిన మహిళ 1999లో కొనుగోలు చేశారు. అందులో ప్రస్తుతం రేకుల ఇల్లు కట్టుకొని ఉంది. ఇంటి పన్ను కూడా సదరు మహిళపైనే ఉంది. అయితే 2023లో కొందరు వ్యక్తులు ఈ ప్లాటుకు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఈసీలో కూడా స్పష్టంగా 1999లో ఓ మహిళ కొనుగోలు చేసినట్లు చూపిస్తుండగా, సబ్ రిజిస్ట్రార్ అవేవీ పట్టించుకోకుండా అక్రమార్కుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు సంబంధించి బాధితురాలు ఫిర్యాదు చేయగా నెల్లూరు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు పలువురిపై వేదాయపాళెం స్టేషన్‌లో కేసు నమోదైంది.

గతవారం వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో నమోదైన భూ ఆక్రమణల కేసులివి. ఈ విధంగా కొత్తూరు ప్రాంతంలో భూ అక్రమాలు కొన్ని వందలున్నాయి. జిల్లా కోర్టు నుంచి హైకోర్టు వరకు అనేక కేసులు నడుస్తున్నాయి. నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న కేసుల జాబితాను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. కానీ సాధారణంగా సివిల్ కేసులను పోలీసులు పట్టించుకోరు కాబట్టి ఈ భూ అక్రమాలపై కేసులు నమోదు కావడం లేదు. పైరెండు కేసులు కూడా పెద్దస్థాయి వ్యక్తులు చెప్పబట్టే కట్టారని పోలీసు వర్గాల సమాచారం.



నెల్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర శివార్లలోని కొత్తూరు ప్రాంతం భూ సమస్యలకు చిరునామాగా మారింది. ఈ ప్రాంతం ఒకప్పుడు గ్రామం. దీంతో అక్కడ సాగు భూములున్నాయి. క్రమేణా అది నెల్లూరు నగరంలో కలిసిపోవడంతో వ్యవసాయ భూములు కాస్తా నివాస భూములుగా రూపాంతరం చెందుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో ఆ భూముల ధర కూడా అమాంతం పెరుగుతూ వస్తోంది. అదే విధంగా భూ సమస్యలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. కొత్తూరు ప్రాంతంలో చాలా భూములు గతంలో పేదలకు చెందినవే. అందులో చాలా మటుకు స్వాతంత్ర్యానికి పూర్వం అసైన్‌మెంట్ కింద ఇచ్చిన భూములున్నాయి. పంచాయతీగా ఉన్న సమయంలో కొందరు భూస్వాములు పేదలకు అప్పులిస్తూ వారి నుంచి అగ్రిమెంట్లు చేయించుకుని భూములు స్వాధీనం చేసుకున్నారు. ఇవి అసైన్‌మెంట్ భూములైనప్పటికీ ఆ తర్వాత వారికున్న పలుకుబడితో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. అప్పట్లో పేదల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని వారికి తెలియకుండా భూస్వాములు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ఉదంతాలు కూడా అనేకం బయటకొచ్చాయి.

20 ఏళ్లలో అధికం

గడిచిన ఇరవై ఏళ్లగా ఈ ప్రాంతంపై భూ ఆక్రమణదారుల కళ్లు పడ్డాయి. ఈ మాఫియాలు చొరబడ్డాక నకిలీ పట్టాల సృష్టి ఎక్కువైంది. వీటిపై గతంలో అనేక గొడవలు కూడా జరిగాయి. ఈ మాఫియాకు గతంలో రెవెన్యూ శాఖ కూడా సహకరించడంతో జిల్లాలో ఎక్కడా లేనంతంగా కొత్తూరు ప్రాంతంలో భూ సమస్యలు నెలకొన్నాయి. ఏళ్లు గడిచేకొద్దీ సమస్యలు ఎక్కువవుతున్నాయే తప్ప తగ్గడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో అయితే భూవివాదాలు తారాస్థాయికి చేరాయి. ఓ మాజీ కార్పొరేటర్ భర్త కొత్తూరు ప్రాంతంలో విచ్చలవిడిగా చెలరేగిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే దానికి ఎవరో ఒకరి పేరుపై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, ఆ తర్వాత వీలైతే భూమిని స్వాధీనం చేసుకోవడం, కుదరకపోతే వివాదాస్పదంగా మార్చి తక్కువ ధరకు కొనుగోలు చేయడం అలవాటుగా మార్చుకు న్నారు. తాజాగా ఈ వ్యక్తిపై కూడా పోలీసు కేసు నమోదవడం గమనార్హం. రాజకీ య నాయకులు, పోలీసులు, రెవెన్యూ అధికారుల వద్ద అనధికారికంగా కొత్తూరుకు సంబంధించిన అనేక భూ వ్యవహారాల పంచాయితీలు జరుగుతున్నాయి. బలమున్న వారు కోర్టుల్లో పోరాటం చేస్తుండగా, బలహీనులు కబ్జాదారులకు లొంగిపోతున్నారు.

చిన్నారులకు టీకాలు సక్రమంగా వేయాలి

● వైద్యులకు శిక్షణలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల అమలు, వాటి భద్రతపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం నెల్లూరులో డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి అధ్యక్షతన జరిగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే అతిప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షణ కోసం తప్పని సరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. హెపటైటిస్ బీతోపాటు మసూచి, రూబెల్లా వంటి వ్యాధులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని సూచించారు. సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక స్థిఫీ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వ్యాక్సిన్‌ను 4 కండిషన్ ఐస్‌ప్యాక్స్ ఉన్న కారియర్‌లలో తీసుకువెళ్లాలని తెలియచేశారు. అలాగే బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

వీఆర్ స్కూల్‌లో టీడీపీ కార్యకర్తల పిల్లలకే ప్రవేశాలు

● ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ స్కూల్‌లో టీడీపీ కార్యకర్తల పిల్లలకు మాత్రమే సీట్లు కేటాయిస్తూ మంత్రి నారాయణ పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పథకాలు, రుణాలు, కాంట్రాక్టులు, స్ట్రీట్ షాపులు... ఇలా అన్నీ టీడీపీ నాయకులు, కార్యకర్తలకే అందజేస్తున్నారని విమర్శించారు. వీఆర్ స్కూల్‌లో ఇప్పటి వరకు 1063 మంది పిల్లలకు అడ్మిషన్ ఇస్తే వారిలో 669 మంది వివిధ కార్పొరేట్ స్కూల్స్‌లో లక్షలు వెచ్చించి చదువుతున్న పిల్లలే ఉన్నారన్నారు. 264 మంది పిల్లలు టీడీపీ నాయకుల సిఫార్సుతో వీఆర్ స్కూల్‌లో అడ్మిషన్ పొందారన్నారు. తాను స్వయంగా పేద విద్యార్థిని అడ్మిషన్ కోసం పంపిస్తే నారాయణ టీమ్‌ను కలవాలని ప్రిన్సిపాల్ చెప్పారన్నారు. బస్సులు, స్నాక్స్ కొనుగోలు కోసం రూ.10 కోట్లు కార్పొషన్ నిధులు మంజూరు చేసుకున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ స్కూల్‌ను ప్రభుత్వానికి ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు.

అనధికార నిర్మాణాల కూల్చివేత

నెల్లూరు(సిటీ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నిబంధ నలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై కార్పొరేషన్ సిటీప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం వెంకటరామాపురం, జేమ్స్ గార్డెన్స్ ప్రాంతాల్లో మూడు భవనాల్లోని అనధికార నిర్మాణాలను తొలగించారు. ఈ భవనాలు సిటీ ప్లానింగ్ నియమ, నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో వాటిని తొలగించాలని నోటీసులు జారీ చేశారు. యజమానుల నుంచి స్పందన లేకపోవడంతో భారీ యంత్రాలతో రంగంలోకి దిగిన అధికారులు, సిబ్బంది నిర్మాణాలను కూల్చేశారు. నిబంధనలు పాటిస్తూ అనుమతి పొందిన మేరకే నిర్మాణాలుండాలని, లేకపోతే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ హెచ్చరించారు.



భవనాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్స్‌కవేటర్

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం

నెల్లూరు(సిటీ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు తల్లిపాల విశిష్టతపై అవగాహన పెంచుకోవాలని, తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని 33వ డివిజన్ కార్పొరేటర్ కరణం మంజుల అన్నారు. వెంగళరావు నగర్‌లో సీడీపీవో అరుణతో కలిసి బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భవతులకు సారె అందచేశారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కరణం హజరత్ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణీకి సారె అందచేస్తున్న కార్పొరేటర్ మంజుల

వాస్కులర్ సర్జరీపై అవగాహన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ వాస్కులర్ దినోత్సవం సందర్భంగా నగరంలో బుధవారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. గాంధీబొమ్మ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ప్రజల్లో గుండెపోటు, మూత్ర పిండాల వ్యాధులపై అవగాహన ఉందన్నారు. అయితే పాదాలలో రక్తం గడ్డ కట్టడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన లేదన్నారు. ఈ నేపథ్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించామని చెప్పారు. మెడికవర్ ఆసుపత్రి వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మహానగరాలలో అందుబాటు లో ఉండే వెరికోస్ రక్త నాళాల చికిత్స మెడికవర్ ఆసుపత్రిలోనూ అందుబాటులో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ సతీష్, పీఆర్వో గోసల సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ కూడలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న డాక్టర్ సుధీర్, వైద్యులు, సిబ్బంది

చుండూరు మృతవీరులకు ఘన నివాళి

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా చుండూరు దళిత మృత వీరుల కు బుధవారం కందుకూరులో వివిధ దళిత సం ఘాల నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దళిత నాయకులు మాట్లాడుతూ 1991లో చుండూరులో అగ్రకులాలు మాలపల్లెపై దాడిచేసి పోలీసుల సహకారంతో 9మంది మాలలను బరిసెలతో పొడిచి కత్తులతో నరికి అతిక్రూరంగా చంపేశార న్నారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న విద్యా ధికుడు కోమెర్ల అనిల్‌కుమార్‌ను ఎస్పీ మీనా కాల్చి చంపడం అప్పటి దమనకాండకు నిదర్శన మని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘోరకలిని చూసిన రమేష్ గుండెపోటుతో మృతిచెందగా మృతదేహాల పోస్టుమార్టం చేసిన డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడని రిపోర్టు ఇచ్చారని విమర్శించా రు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు లింగాబత్తిన బ్రహ్మయ్య, రేణమాల అయ్యన్న, పాలేటి కోటేశ్వరరావు, డీసీహెచ్ మాలకొండయ్య, మాధవరావు, హరిప్రసాద్, గేరా చిరంజీవి, బత్తల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాష్ట్రాభివృద్ధిలో 75 శాతం కేంద్రం నిధులే : కందుకూరి

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 75 శాతం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులేనని బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఓ హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో నాలుగేళ్లలో నూతన ఆవిష్కరణలతో మరిన్ని అభివృద్ధి పనులను రాష్ట ప్రభుత్వం చేపడుతుందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. లక్షలాది కోట్ల నిధులతో జాతీయ రహదారులతో సహా అన్ని రోడ్ల రూపురేఖలు మారనున్నాయన్నాయన్నారు. నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బెల్లంకొండ మాల్యాద్రి మాట్లాడుతూ నెల్లూరులో జరగనున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనకు కావలి నుంచి వేలాదిగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీవీసీ సత్యం, వీవీ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళా ప్రదర్శనలు

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో బుధవారం కందుకూరులో నిర్వ హించిన ప్రజానాట్యమండలి కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులకు స్థానిక సీపీఐ నాయకులు ఘన స్వాగతం పలుకగా పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో కళాకారులు గజ్జకట్టి ఆడుతూ కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ.మాలకొండయ్య మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలపక్షాన నిలిచి పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టు పార్టీ అని, సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతున్నందున యువకులు, విద్యావంతులు, రైతులు, రైతుకూలీలు అధికసంఖ్యలో హాజరై పేదలపక్షాన నిలిచే పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ప్రజానాట్యమండలి కళాజాతా పోకూరు, వలేటివారిపాలెం మీదుగా పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్‌మోహన్, దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బాలబ్రహ్మాచారి, కోటేశ్వర రావు, హరిబాబు, నరసయ్య, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా మగ్గం నేసినా రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదు. నేసిన చీరలకు మార్కెట్ లేకపోవడంతో మాస్టర్ వీవర్స్ ధరలు బాగా తగ్గించారు. గిట్టుబాటు కాక మరో పని చేయలేక చాలీచాలని కూలితో కుటుంబాన్ని పోషిస్తున్నాం

- ఏ శ్రీనివాసులు, నేత కార్మికుడు, సంగం

ముడి నూలుపై రాయితీ ఇవ్వాలి



ముడి నూలుపై గతంలో రాయితీలు ఇవ్వడం వల్ల ఏడాదికి సుమారు రూ.50 వేలు లబ్ధి చేకూరేది. దీంతో శ్రమకు తగ్గ కూలి గిట్టుబాటు అయ్యేది. అయితే, గత ప్రభుత్వం రాయితీ, సంక్షేమ పథకాలు రద్దు చేసింది. దీంతో ఆదాయం కోల్పోయాం.

- రంగనాయకమ్మ, చేనేత కార్మికురాలు, సంగం

మార్కెట్ వసతి కల్పించాలి



నేతన్నకు పెట్టుబడి ఇచ్చి ఉత్పత్తి చేసిన చీరలకు మార్కెట్ వసతి కల్పించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో రైతు బజార్లు ఏర్పాటు చేసినట్టు చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి. అందులో కార్మికులే నేసిన చీరలను విక్రయించే అవకాశం కల్పించాలి. రాయితీపై ముడినూలు సరఫరా చేయాలి.

- మాగం గిరి, చేనేత కార్మికుడు, సంగం

పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరు గ్రామంలో రూ.76 లక్షల వ్యయంతో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాటూరులో చేనేతల ఉత్పత్తులు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో చేనేతలు ఆనందపడుతున్నారు. ఇప్పటికే పాటూరు, గుమ్మళ్ళదిబ్బ ప్రాంతాల నుంచి 175 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి రూ.30లక్షల మేర నిధులను కేటాయించారు. వారిలో 85మందికి స్టాండ్‌మగ్గాలు, జాకార్డ్ మిషన్లను అందచేశారు. అందరికీ యంత్రాలతో నడిచే రాట్నాలు అందించనున్నారు. రూ.12 లక్షలతో షెడ్డు నిర్మించేందుకు ముగ్గురికి నిధులు మంజూరు చేశారు.


ఎంతో ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు రాయితీలు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవడం అభినందనీయం. ఎప్పటినుంచో చేనేతల బతుకుల్లో వెలుగు నింపమని కోరుతున్నాం. చేనేత దినోత్సవం నాడు నేత వస్త్రాలనే ధరించాలని అంతా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

-కేవీ శేషయ్య, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



రాజరాజేశ్వరి ఆలయంలో ప్రదోషకాల అభిషేకం అనంతరం నందీశ్వరుడికి విశేష అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : త్రయోదశి తిథి సందర్భంగా శివాలయాల్లో బుధవారం సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామి సన్నిధిలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రదోష సమయంలో నందీశ్వరునికి అభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి. ఆలయ సహాయక కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్య వేక్షించారు.

● మూలస్థానేశ్వరాలయంలో ప్రదోషకాల పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం నందీశ్వరస్వామికి అభిషేకాలు, విశేష అలంకారాలు, పూజలు జరిగాయి. మూలస్థానేశ్వరస్వామి, భువనేశ్వరి అమ్మవారికి చిన్నవెండి నందిపై ఉత్సవం జరిగింది. ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో వెండి నంది వాహనంపై ఆదిదంపతులు





మందారం పువ్వులు ఎన్ని రకాలో..









మొక్కలకు పూలందం.. మనసుకు ఆనందం!

పచ్చని మొక్కల మధ్య విరబూసే పూలు మనసును ఎంతో హాయి గొలుపుతాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు బిజీ బిజీగా గడిపేవాళ్లు కాస్త ఆహ్లాదం కోసం పార్కులకు వెళతారు. ఇంకొందరు ఇంటి ముంగిట, మిద్దెపైన రకారకాల మొక్కలను పెంచుతూ ఆనందానుభూతి పొందుతారు. ఒకప్పుడు ఈ మొక్కల కొనుగోలుకు దూరప్రాంతాలకు వెళ్లవలసి వచ్చేది. కానీ ప్రజల అభిరుచులకు అనుగుణంగా చాలామంది వ్యాపారులు రకరకాల పూల మొక్కలను తెచ్చి రోడ్డుపక్కన విక్రయిస్తున్నారు. గులాబీలు, మందారం, చేమంతి, కనకంబరాలు, మల్లెలు ఇలా ఎన్నో రకాల దేశీ, విదేశీ పూలమొక్కలు నగర వాసులను ఆకట్టుకుంటున్నాయి.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)









పెద్ద మార్పునకు చిన్న ప్రయత్నం!

పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నియంత్రించేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయత్నం చేస్తోంది. పిల్లల ద్వారా పెద్దల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలు, వ్యాధుల గురించి విద్యార్థులకు తెలియచేసి వారి ద్వారా పొగాకు బానిసల్లో మార్పు తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది.

- పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనారోగ్యం
- జిల్లాలో 8 లక్షల మందికిపైగా బానిసలు
- ఏటా రెండు వేల మందికిపైగా మృతి
- వినియోగ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం
- విద్యార్థులకు అవగాహన తరగతులు
- చిన్నారుల ద్వారా పెద్దల్లో మార్పునకు ప్రయత్నం
- ప్రతిజ్ఞపై సంతకాల సేకరణ
- ఎక్కువ సంతకాలు చేయించే వారికి ప్రోత్సాహకం

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా, అటు వైద్యులు.. ఇటు ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా లక్షల మంది 'పొగ' వదలడం మానడం లేదు. సిగరెట్... గుట్కా... పాన్ మసాలా... కొన్ని రకాల కిళ్లీలు... వంటి పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడనే శాసిస్తున్నాయి. సరదాగా ప్రారంభమై వీటికి బానిసలవుతున్న ఎందరో చివరకు మృత్యువుకు చేరువవుతున్నారు. ఇలాంటి వారి వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



పొగాకు ఉత్పత్తుల వాడకం అనర్థాలపై నెల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న అవగాహన తరగతి (ఫైల్)

నేటి ఆధునిక ప్రపంచంలో వయసుతో నిమిత్తం లేకుండా పిల్లలుసైతం పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావటం కలవరపెడుతున్న సమస్య. జిల్లాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నారంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతోందో అర్థం చేసుకోవచ్చు. పొగాకు ఉత్పత్తుల్లో ప్రమాదకరమైన 4వేల రకాల రసాయనాలు ఉన్నాయి. వీటి వాడకంతో శరీర అవయవాలు దెబ్బతిని జిల్లాలో ఏటా 2వేల మందికి పైగా మృతి చెందుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎలాగైనా పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మానించాలని యత్నిస్తోంది.

విద్యార్థులతో చైతన్యం

పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించేందుకు 7,8,9 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. గత నెల (జూలై) 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని 2594 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ అవగాహన తరగతులను నాన్ కమ్యునబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) విభాగం చేపట్టింది. దీనిద్వారా 20వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించింది. 'ఇకపై పొగాకు ఉత్పత్తులు వినియోగించము' అనే సారాంశంతో విద్యార్థులు ఒక ప్రతిజ్ఞ పత్రాన్ని తయారు చేసుకుని కుటుంబ సభ్యులతోపాటు చుట్టు పక్కల వారి నుంచి పెద్ద ఎత్తున సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. పిల్లల మాట పెద్దలు వింటారన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టింది. ప్రతిజ్ఞ పత్రంపై ఎక్కువ సంతకాలు చేయించిన విద్యార్థులకు నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం వారి నుంచి కానుకగా ప్రత్యేక స్కూల్ బ్యాగులను అందిస్తోంది. ఆ బ్యాగులను ఈ నెల 15వ తేదీన అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యధిక సంతకాలు చేయించిన వారిని మండలానికి ముగ్గురి చొప్పున ఎంపిక చేసి విద్యాశాఖ అధికారుల ద్వారా బ్యాగులు అందజేయనున్నారు. కాగా, పొగాకు ఉత్పత్తుల బానిసలకు నెల్లూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు.



ఎక్కువ సంతకాలు చేయించిన విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహక బ్యాగు

తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం



పొగాకు ఉత్పత్తుల వాడకం నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు తల్లిదండ్రులు, ఇతర పెద్దలకు తెలియ చేసే అవకాశం ఉంది. పిల్లలు చెబితే పెద్ద వారు వింటారన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పొగాకు ఉత్పత్తులను ఇక వాడమంటూ ప్రతిజ్ఞ పత్రంలో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో పొగాకు వినియోగించే వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

\- డాక్టర్ యశ్వంత్, ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి

అడవి పందులను ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి

మృతుడు ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండల వాసి

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అడవి పందులను ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్ సమీపంలో బుధవారం జరిగింది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం గుంటూరులింగనపాలెంకు చెందిన కరణం నరసింహం(53) పీసీ పల్లి నుంచి మాలకొండ అడ్డ రోడ్డు మీదుగా మొగిలిచెర్లకు మోటారుసైకిల్‌పై వెళుతుండగా గ్రామానికి కిలోమీటరు దూరంలో షడన్‌గా రోడ్డుపైకి అడవి పందులు వచ్చాయి. దీంతో ఏమిచేయాలో తెలియని నరసింహం కంగారులోమోటారు సైకిల్‌తో వాటిని ఢీకొని కిందపడి పోయాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో సమీపంలో ఉన్న కొందరు మొగిలిచెర్ల గ్రామస్థులు గమనించి నరసింహంను పక్కకు తీసి వివరాలు తెలుసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు నరసింహంను చికిత్స నిమిత్తం 108లో లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో బంధువులు లింగసముద్రం ఎస్‌ఐ నారాయణకు ఫిర్యాదు చేశారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



మొగిలిచెర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరసింహం

కోడూరు గురుకులంలో ఆరుగురికి అస్వస్థత

తోటపల్లిగూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫుడ్ పాయిజన్ లేదా తాగునీటి లోపాల వల్లే నలుగురు అతిసారాకు గురయ్యారని, ఇద్దరు విద్యార్థులకు విషజ్వరాలు వ్యాపించాయని ప్రభుత్వ వైద్యాధికారి తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఆరోగ్యం సరిగాలేదని, వారికి వైద్యం అందించేందుకు నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పామన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల అధికారులు బుధవారం గురుకుల పాఠశాలను, పరిసర ప్రాంతాలను, వంటగదిని పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురై ఉంటారని తహసీల్దారు పద్మావతి తెలిపారు. గురుకుల పాఠశాలలో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆమె తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.



పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న తహసీల్దారు పద్మావతి



మురుగు కాలువలోనే మృతదేహాన్ని మరుభూమికి తీసుకెళుతున్న గిరిజనులు

మురుగులోనే మరుభూమికి..

బతికున్నప్పుడే కాదు... చనిపోయాక కూడా గిరిజనులకు కష్టాలు తప్పేలా లేవు. మండలకేంద్రమైన మనుబోలు చంద్రమౌళీనగర్ గిరిజనకాలనీలో ఎవరైనా చనిపోతే మరుభూమికి తీసుకెళ్లాలంటే ఈ చిత్రంలో చూపినట్లుగా గిరిజనులు మురుగునీటిలో అవస్థలు పడుతూ తీసుకెళ్లాలి. ఆ కాలనీలో సుమారు 400 కుటుంబాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పుకున్నా మరుభూమి దారి గురించి ఎవరూ పట్టించుకోలేదని గిరిజనులు వాపోయారు. కాలనీ నుంచి కిలోమీటరు దూరంలో గిరిజనుల శ్మశానం ఉంది. ఆ దారంతా ముళ్లచెట్లు, కాలువలు, గుంతల మధ్యలో నడుచుకుంటూ మృతదేహాలను తీసుకెళ్లాలి. ఎండాకాలమే ఇలా ఉంటే.. ఇక వర్షాకాలంలో చనిపోయిన వారిని తీసుకెళ్లాలంటే గిరిజనుల ఇక్కట్లు చెప్పనలవికావు. ఇకనైనా పాలకులు, అధికారులు కరుణించి, శ్మశానానికి దారి కల్పించాలని వారు కోరుతున్నారు.

\- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ, క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం నాడు రాష్ట్రస్థాయిలో అందించే అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటికే అర్హతలకు సంబంధించిన వివరాలను అన్నీ పాఠశాలలకు పంపించామని తెలిపారు. అర్హులైన వారు శుక్రవారం సాయంత్రం 5గంటల్లోపు వారి ప్రతిపాదనలను ఉప విద్యాశాఖాధికారులకు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.deo.nellore.50webs.comలో పరిశీలించాలని తెలిపారు.

- స్వాతంత్ర్య దినోత్సవం నాడు అందించే క్రీడా అవార్డులకు జిల్లాలో విశిష్ట సేవలందించిన క్రీడా సంఘాల నుంచి మూడు కేటగిరిల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేటగిరి-1లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన క్రీడా సంఘం, కేటగిరి-2లో జిల్లాలోని క్రీడా సంఘాల్లో అత్యధికసార్లు జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించిన క్రీడా సంఘం, కేటగిరి-3లో జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను తయారు చేసేందుకు అత్యధికంగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించిన సంఘం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సమాంతరంగా అసోసియేషన్లు కలిగి ఉండేవారు ఈ అవార్డులకు అనర్హులని తెలిపారు. అదేవిధంగా కోర్టు వివాదాల్లో ఉండేవారు, డీఎస్‌ఏ, ఒలంపిక్ సంఘం గుర్తింపు లేని వారు అనర్హులని ప్రకటించారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువీకరణలతో ప్రతిపాదనలను ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎస్‌ఏ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ ఆర్ఎం షమీమ్

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్న దృష్ట్యా సర్వంసిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురువారం నాటికి రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా బస్సుల కండీషను, ప్రధాన డోర్లు, ఎమర్జెన్సీ డోర్లు, ఫుట్‌పాత్‌లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సక్రమంగాలేని వాటికి మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. బస్సులకు పెయింటింగ్ చేసి అందంగా తీర్చిదిద్దుతామన్నారు. బస్సెక్కే మహిళల పట్ల డ్రైవర్, కండక్టర్ ఎలా నడుచుకోవాలి, జీరో పేమెంట్ టిక్కెట్ ఇవ్వడం తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బస్సులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని ఆన్‌కాల్ డ్రైవర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు 24 కొత్త బస్సులు మంజూరు కాగా ఉదయగిరి డిపోకు 7 బస్సులు కేటాయించామన్నారు. అనంతరం బస్సుల మరమ్మతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ నాగభూషణం, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



బస్సు మరమ్మతులు పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం షమీమ్

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీ దుర్గా భవాని జ్యోతిష్యాలయం

స్త్రీ, పురుషుల వశీకరణ, కుటుంబ, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యా భర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పబడును. శ్రీ దుర్గ హోటల్ ఎదురుగా, స్టోన్‌హౌస్‌పేట, సెల్:97042 49338

AJR-240715

జెరాక్స్ ఆపరేటర్

యూనివర్సిటీ జెరాక్స్, గాంధీబొమ్మ వద్ద, నెల్లూరు నందు పనిచేయుటకు కంప్యూటర్/ జెరాక్స్ ఆపరేటర్స్ కావలెను. అనుభవం అవసరం లేదు. యువతీ, యువకులు సం.ప్ర. సెల్: 98481 54861

AJR-167

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అపోహలు వద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది!

- 5 సెంట్ల భూమి, అందులో ఇంటినీ నిర్మిస్తాం
- యథావిధిగా నష్టపరిహారం పంపిణీ
- ప్రత్యేక అధికారితో అనుమానాల నివృత్తి
- ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఆనంద్

ఉలవపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : 'అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది. మీలో ఏర్పడిన అపోహలు తొలగించేందుకు మీ వద్దకే వచ్చా'నని కరేడు శివారు గ్రామం ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజతో కలిసి ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో కలెక్టర్ పర్యటించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తమకు కల్పించే వసతులు, ప్యాకేజీ గురించి వివరించాలని కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు క్రమంలో కరేడులోని 19 గ్రామాల్లో పొట్టేనుగుంట, రామకృష్ణాపురం, ఉప్పరపాలెం మూడు గ్రామాలు పరిశ్రమ పరిధిలోకి వచ్చినందున తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అయితే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం వసతులు, పరిశ్రమలో నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగ భృతి, నూతన కాలనీ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ విధి అని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో డిగ్రీ వరకు చదివిన యువకులు సుమారు 30 మంది వరకు ఉన్నామని, నిర్మించబోవు పరిశ్రమలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరారు.

● వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తాం

ఒక ఇంట్లో 18 ఏళ్లు జరుగుతున్నా, నిండిన వారందరినీ ప్రత్యేకంగా ఒక్కో కుటుంబంగా లెక్కలోకి తీసుకొని ఒక్కొకరికి



విలేకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

5 సెంట్ల ఇళ్ల స్థలం, ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణం, జీవన భృతి కోసం ఒక్కో కుటుంబానికి రూ.6.5 లక్షల పరిహారం ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతేగాక ప్రస్తుతమున్న ఇళ్ల భవనాలు, ఖాళీ స్థలానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చట్టం ప్రకారం రెట్టింపు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, దీనికితోడు ఎస్సీలకు ప్రత్యేక రాయితీ కూడా ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. ఒకవేళ ఎవరికివారే ఇంటి నిర్మాణం చేపడితే ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.3.5 లక్షలు కేటాయిస్తుందని, వీటికి తోడు యథావిధిగా నష్ట పరిహారాలు అందుతాయన్నారు. ప్రభుత్వం భూమిని ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న వారికి కూడా 571 జీవో ప్రకారం పరిహారం కల్పించే వెసులుబాటు ఉంటుందని, చెరువులు, కుంట పోరంబోకు భూములకు మాత్రం ఈ జీవో వర్తించదని స్పష్టంగా చెప్పారు. వారం రోజులపాటు జల్లా స్థాయి అధికారి గ్రామంలోనే ఉండి కాలనీ వాసుల అనుమానాలు, అపోహలు నివృత్తి చేస్తారంటూ అక్కడే ఉన్న తెలుగు గంగ డిప్యూటీ కలెక్టర్ మురళిని పరిచయం చేశారు.

● రైతులతో ప్రత్యేక సమావేశం

సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 4800 ఎకరాలను సేకరించనున్నట్లు కలెక్టర్ రైతులకు స్పష్టం చేశారు. ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ నుంచి నేరుగా కరేడు సచివాలయం-1లో కరేడు జాతీయ రహదారి పక్కన భూమి ఉన్న రైతులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హైవే పక్కన బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లపైనే ధర ఉంటే ప్రభుత్వం రూ.60 లక్షల చెబుతోందని, దీనికి తాము సమ్మతంగా లేమని రైతులు చెప్పారు. అదీ హైవేకు ఆనుకొని ఉన్న భూములకు మాత్రమే రూ.60 లక్షలని, పైభూములకు రూ.20 లక్షల చొప్పునే పరిహారం ఉంటుందని చెప్పగా తమ భూములు ఇవ్వమని హైవే రైతులు కరాఖండిగా చెప్పారు. ఇది తొలి సమావేశమే కాబట్టి ఇంకా 2, 3 సమావేశాలలో చర్చించి ఒక అవగాహనకు వద్దామని రైతులకు కలెక్టర్ నచ్చచెప్పారు. అనంతరం బయటకు వచ్చిన కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం భూమి ఇచ్చేందుకు సమ్మతించిన 80 మంది రైతులకు రూ.3 కోట్లు వరకు పరిహారం వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా స్వచ్ఛందంగా భూములు ఇచ్చే రైతులతో మాటలు జరుగుతున్నాయన్నారు.

సచివాలయం తనిఖీ

అనంతసాగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాయపల్లి బిట్-1 సచివాలయాన్ని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ బుధవారం తనిఖీచేశారు. ఈసంద ర్భంగా రికార్డులు పరిశీలించారు. ఉద్యో గులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో బయటకు వెళ్లే సమ యంలో మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు. పీ-4 సర్వేపై ప్రతేక శ్రద్ధ చూపాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9617
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

న్యూస్ బాక్స్

పీ 4 సర్వే పూర్తిచేయాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సీతారామపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాల మేరకు బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను అన్ని గ్రామ సచివాలయాల్లో త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో తనిఖీ చేసి, పలు రిజిస్టర్లను పరిశీలించారు. అయ్యవారిపల్లి సచివాలయ పరిధిలో పీ4 సర్వే త్వరగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. స్థానిక నేతలు, వ్యాపారవేత్తలను భాగస్వాములు చేస్తూ బంగారు కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వంశీకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్‌గా ఉదయగిరిని మార్చాలని డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు షేక్‌ఎండీ ఖాజా, వీ రామచంద్రమూర్తి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం నియోజకవర్గాన్ని ముక్కలు చేసి ప్రజలకు రెవెన్యూ డివిజన్ అందుబాటులో లేకుండా చేసిందన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఆయా డివిజన్‌లకు ప్రజలు, రైతులు వెళ్లలేక, సమస్యలు పరిష్కారంకాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని ప్రతిపాదన చేశారని, ఆదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి ఈప్రాంత ప్రజల కష్టాలు తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆది ఆంధ్ర పాఠశాలలో బుధవారం డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, ఎస్‌వీపీ వైద్యశాల అధినేత డాక్టర్ ప్రణీత్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు లక్కు కృష్ణప్రసాద్, తోడేటి అశోక్, రహీం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

చేజర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఫేజ్-2 కింద మండలంలో పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పరిశీలించారు. తూర్పుపల్లి గ్రామంలో జరుగుతున్న తరగతుల నిర్మాణాలతో పాటు, చేజర్ల, ఆదురుపల్లి ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అదేవిధంగా శిథిలా వస్థలో ఉన్న ఏటూరు ఎస్సీ పాఠశాలను పరిశీలించి అదనపు గదులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంవత్సరం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన నూతక్కి వారి కండ్రిక పాఠశాలను సందర్శించి అదనపు గదులకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌ఈవో-2 మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఆక్రమణ తొలగించండి

ఏఎస్ పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దారి ఆక్రమణను తొలగించాలని అనుమసముద్రం గ్రామ అరుంధతీవాడ వాసులు బుధవారం తహసీల్దారు అనిల్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు. అరుంధతీవాడ నుంచి రాజవోలు వెళ్లే బాటను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకోని దారి లేకుండా చేశారని, పరిశీలించి ఆక్రమణ తొలగించాలని కోరారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా బుధవారం వై పుణ్యవతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎంఈవోకు సన్మానం

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండల ఇన్‌చార్జి ఎంఈవో-1గా పని చేస్తూ సీతారామపురం మండల రెగ్యులర్ ఎంఈవోగా బదిలీ అయిన షేక్ మస్తాన్‌వలిని స్థానిక మండల విద్యావనరుల కేంద్రం బుధవారం ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువుల కబ్జా

- దర్జాగా పొలాల సాగు
- ఇళ్ల నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



పీకేపాడు చెరువు లోతట్టు ప్రాంతంలో భూమిని ఆక్రమించి సాగుచేస్తున్న పొలాలు



మంచాలపల్లి వద్ద పట్టలు కట్టి చేపట్టిన ఇళ్ల నిర్మాణం

అనంతసాగరం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి చెరువులు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మండలంలోని పడమటికంభంపాడు చెరువు వెనుక వైపు సోమశిల ప్రాంతంలో చెరువు కబ్జాకు గురైంది. ఏళ్లుగా పొలాలు సాగుచేస్తూ.. క్రయవిక్రయాలు జరుపుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. బొమ్మవరం చెరువు గత వైసీపీ హయాంలో చాలా వరకు ఆక్రమణకు గురైంది. అప్పట్లో వైసీపీ నాయకుల అండతో ఇక్కడ పెద్దఎతున గ్రావెల్ తవ్వకాలు జరిపి లక్షలు గడించడంతో పాటు సాగు యోగ్యమైన ప్రాంతాలను ఆక్రమించి పత్తి, మిరప పొలాలుగా మార్చేశారు. అనంతసాగరం చెరువు లోతట్టు గౌరవరం వద్ద చేపల చెరువులు విస్తరించాయి. ఇందులో చెరువు భూమి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా మస్తాపురం, మంచాలపల్లి గ్రామాల పరిధిలో చెరువు కబ్జాకు గురైంది. మంచాలపల్లి వద్ద ఏకంగా చెరువులోనే ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇదేస్థితిలో వెంగంపల్లి, కామిరెడ్డిపాడు చెరువులు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో



ఆత్మకూరు: మాట్లాడుతున్న సీడీపీవో సునీలత



ఉదయగిరి: గర్భిణులకు చీర, సారె అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ఆత్మకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని సీడీపీవో పి సునీలత తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కరటంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సాతానుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

●**సంగం:** శిశువు జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేష్ఠమని ఐసీడీయస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. బుధవారం మండలంలోని దువ్వూరు ఈహెచ్‌డబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** తల్లిపాలు శిశువుకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్‌షాను అన్నారు. ఆమె బుధవారం సింగారెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రత్తమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పావని, ఆశ వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు చీర, సారె పంపిణీ

●**ఉదయగిరి:** మండలంలోని గండిపాళెం హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాల కొండయ్యాచౌదరి తన ప్రతినిధులచే గర్భిణులకు చీర, సారె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాక్టివ్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి చీర, గాజులు, పూలు, పసుపుకుంకుమ అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, చాంద్‌బేగం, సౌజన్య, మమత, నాగరత్నమ్మ, ఏఎన్‌ఎం సావిత్రి, ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, పాముల రాజా పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక మహోత్సవం



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఆత్మకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలలో రెండోరోజు బుధవారం అష్టోత్తర శత కలశాభిషేకం, హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్య అన్నదాత కంచి పరమేశ్వరెడ్డి, వేద పండితులు కంభాలూరు మధుసూదన శర్మ, ఇనుపకుతిక నాగభూషణం, ఆలయ అర్చకులు విశ్వనాథం శ్రీనివాస శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు కెవి శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, పందిపాటి సుధాకర్‌రెడ్డి, విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, పెళ్లూరు వెంకటేశ్వర్లు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. గురువారం స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు దేవేరుల గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు.

9న శ్రీనివాస కల్యాణం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించే శ్రీనివాస కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కల్యాణోత్సవానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, శ్రీనివాసరావు, ఆవుల రోశయ్య, రమేష్‌రెడ్డి, కార్తీక్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడు కల్పించాలని గిరిజనుల ఆందోళన



కొత్తపల్లి ఎస్టీ కాలనీలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి ఎస్టీ కాలనీలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గూడు కల్పించాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇంటి నివేశన స్థలాలు, పక్కాగృహాలకు నోచుకోక రోడ్డుమార్జిన్‌లో గిరిజనులు పూరిగుడెసల్లో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు వారికి పక్కాగృహాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, పలువురు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు నమోదు

సంగం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అత్యాచారం కేసు నమోదు అయింది. వివరాల మేరకు... సంగం గ్రామానికి చెందిన యేసోబు అనే యువకుడికి కలిగిరి రహదారిలో మామిడి తోట ఉంది. ఈ తోటలో ఓ గిరిజన కుటుంబం కాపలా ఉంటున్నారు. ఈనేపథ్యంలో ఆదివారం యేసోబు స్థానిక కొందరు యువకులతో కలిసి తోటలో మందు పార్టీ చేసుకున్నారు. కాపలాగా ఉన్న మహిళపై యేసోబు అత్యాచారం చేసినట్లు బాధిత మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు బుధవారం రాత్రి యేసోబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం : ఆర్డీవో



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పావని

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీవో బీ పావని పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వివిధ సమస్యలపై అర్జీలను అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 16 డెత్ కేసులు గుర్తించామన్నారు. వాటిని క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వారి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేసి వారికి పథకం లబ్ధిచేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎల్ రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, సీఐ వెంకటరావు, రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజా, ఇరిగేషన్, హౌసింగ్ డీఈలు చంద్రమౌళి, పీరాన్, సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్, డీటీ షాజియా, రీసర్వే డీటీ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతే లక్ష్యంగా జేవీవీ విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మూఢ నమ్మకాల నుంచి దూరం చేసి ప్రపంచ శాంతి వైపు నడిపించాలనే లక్ష్యంతో జేవీవీ సైన్స్ పట్ల విస్తృత ప్రచారం సాగిస్తోందని శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హిరోషిమా-నాగసాకి డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైన్స్‌ను ప్రజల అభివృద్ధికి వినియోగించాలే తప్ప బాంబులు తయారుచేసి వినాశనానికి వినియోగించ కూడ దని హితవు పలికారు. అనంతరం విద్యార్థు లకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జడదేవి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లోను కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానోపాధ్యా యుడు మాల కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎం చలం, మండల శాఖ అధ్యక్ష, ట్రెజరర్ షేక్ కరీముల్లా, హజరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి



వెంగారెడ్డిపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏవో, రైతులు

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పంట సాగుచేసే రైతులంతా రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని నేలటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. అర్హులై ఉండి అన్నదాత సుఖీభవ పథకం నగదు పడని రైతులు ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకాల జెరాక్స్ కాపీలతో రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్ర మంలో వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

●**సంగం:** మండలంలోని వెంగారెడ్డి పాళెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో శశిధర్ రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో వరి పొలాలను పరిశీలించి లోపాలను గుర్తించారు. అనంతరం తెగుళ్ల నివారణకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి రైతులను ప్రోత్సహించాలి

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత సబ్‌ట్రెజరీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను బుధవారం ఆత్మకూరు ఆర్డీవో బీ పావని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఉత్పత్తులకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉందన్నారు. అనంతరం ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రామ్మోహన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమార్, డివిజన్ మాస్టర్ ట్రైనర్ కె రామ్మోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లి వేలం కేంద్రంలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం పొంగూరు క్లస్టర్ రైతులు 360 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 193 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 167 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 150 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

మద్యం షాపులో మందుబాబుల ఘర్షణ

- బీరు సీసాలతో దాడి, ఒకరికి తీవ్రగాయాలు



రక్త గాయాలైన నవీన్

కావలిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాలదిన్నెలో ఉన్న గౌడ మద్యం షాపులో బుధవారం మందుబాబులు ఘర్షణ పడ్డారు. బీరుబాటిళ్లతో దాడులు చేసుకోవడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ కామంచి నవీన్ అతని స్నేహితులు, పట్టణంలోని పాలెంకు చెందిన పెయింట్ పనులకు వెళ్లే పులి మల్లికార్జున్ మరో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా మద్యం దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో బీరు బాటిల్‌తో నవీన్ తలపై కొట్టడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని వైన్స్ షాపు నుంచి బయటకు పంపడంతో రోడ్డుపై మళ్లీ ఘర్షణకు దిడారు. ఈ విషయాన్ని వారి సంబంధీకులకు తెలపడంతో మల్లికార్జున్ స్నేహితులు అక్కడ నుంచి పరారుకాగా అక్కడకు చేరుకున్న నవీన్ బంధువులు మల్లికార్జున్ మోటారు బైక్‌ను అడ్డగించి అతనిపై దాడిచేసి అతని బైక్‌పైనే బలవంతంగా ఎక్కించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం అతని బంధువులు ఏరియా వైద్యశాలకు తరలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం



వృద్ధుడి మృతదేహం

కావలిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు మృతదేహాన్ని బుధవారం కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సు గల మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యంకాకపోగా గోధుమరంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, గ్రీన్‌కలర్‌పై పసుపు పూల డిజైన్ గల లుంగీ ధరించి ఉన్నాడు. చేతికర్ర, బూడిదరంగు కలర్ టవల్, బ్రౌన్‌కలర్ వాకర్ చెప్పులు వేసుకున్నాడు. ఎస్‌ఐ వెంకట్రావు మృతదేహాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

- ఆర్‌ఐకి గ్రామస్థుల వినతి
- కొనసాగుతున్న పోలీసు పహారా



ఆర్‌ఐకి వినతిపత్రాలు ఇస్తున్న గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో తెల్లరాయి తవ్వకాల అనుమతులు రద్దుచేయాలని గ్రామస్థులు రోజుల తరబడి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న విషయం విదితమే. దీంతో రెండు రోజులుగా పోలీసులు పహారా కాస్తున్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలు అందజేస్తారన్న సమాచారంతో పోలీసులు ముందస్తుగా వరికుంటపాడులో పహారా నిర్వహించడంతో ఆందోళనకారులు నివాసాలకే పరిమితమయ్యారు. బుధవారం సైతం వరికుంటపాడుతో సహా జంగంరెడ్డిపల్లి గ్రామాల్లోనూ పోలీసు పహారా కొనసాగుతున్నప్పటికీ ఆందోళనకారులు పోలీసుల కళ్లుగప్పి ఎవరికి వారుగా వివిధ మార్గాల్లో తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దారు లేకపోవడంతో గంటల తరబడి ఆయన కోసం ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేదేమిలేక కార్యాలయంలోని ఆర్‌ఐ అర్షద్ అహమ్మద్‌కు ఆయా గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా 85 వినతిపత్రాలను అందజేశారు. మా ప్రాణాలైనా వదులుతాం కానీ గ్రామాన్ని మాత్రం వదలం అనే నినాదంతో మైనింగ్ అనుమతులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్న తమను అడ్డుకునేందుకు ఎన్నడూలేని విధంగా పోలీసులు గ్రామాల్లో పహారా ఉంటుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడ కుండా మైనింగ్ అనుమతులను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



వరికుంటపాడులో పోలీసుల పహారా

రెండు లారీల ఢీ : డ్రైవర్‌కి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు, ఒకటి రోడ్డుపై...రెండోది పొలాల్లో..

మనుబోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆ ప్రమాదం జరిగిన తీరు చూసి అంతా ఆశ్చర్య పోయారు. ఎవరో ఒకరు చనిపోయి ఉంటారనుకున్నారు. అయితే దైవాధీనం ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. దీంతో రెండు లారీల డ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు. మండలపరిధిలోని జాతీయరహదారిపై కొండూరుసత్రం సమీపంలో బుధవారం ఆగిఉన్న లారీని మరోలారీ ఢీకొంది. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నుంచి విజయవాడకు బ్యాటరీ లోడ్‌తో వెళుతున్న లారీ టైర్లు చెక్ చేసుకునేందుకు రోడ్డుపక్క ఆగింది. అదే మార్గంలో తమిళనాడు నుంచి ధాన్యం లోడుతో మేదరమెట్లలోని మిల్లుకు వెళుతున్న లారీ ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో ఆగిఉన్న లారీ రోడ్డుపక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఢీకొన్న లారీ క్యాబిన్ క్లీనర్ పక్క నుజ్జునుజ్జు అయింది. అయితే డ్రైవర్ సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.ఈ ప్రమాదంతో ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్‌ఐ. శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెంపుడు కుక్కను చంపిన వ్యక్తిపై కేసు నమోదు

విడవలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కని చంపిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన వావిళ్ల గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వావిళ్ల గ్రామానికి చెందిన పాటూరు ఆదిలక్ష్మి కొద్ది రోజుల నుంచి పెంపుడు కుక్కని పెంచుకుంటుంది. ఏవ్వరైన కొత్తవారు వస్తే ఆ కుక్క ఆరుస్తూ ఉండేది. అయితే ఆ కుక్క అరుపులు నచ్చని ఎదురింటిలో నివాసం ఉంటున్న మడపర్తి సుదాకర్ ఇంటిలో కట్టివేసి ఉన్న కుక్కని దారుణంగా కొట్టి చంపేశాడు. ఈ మేరకు ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 475

పీ-4 మార్గదర్శుల ఎంపిక సమర్థవంతంగా జరగాలి

అల్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంలో కీలక భూమిక పోషించే మార్గదర్శుల ఎంపిక సమర్థవంతంగా జరగాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో పీ-4 సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల రిజిస్ట్రేషన్‌పై స్పష్టత ఉండాలన్నారు. పేదల జీవితాలను మార్చే ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీటీ ప్రవీణ్ కుమార్, డీడీవో వరప్రసాద్ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించండి

● సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని మాలకొండరాయునిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని, సమయపాలన పాటించాలని చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడేవారిపాలెం, పోకూరు. రామంద్రాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ఈనెల 26వ తేది లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడేవారిపాలెం ఎస్సీ కాలనీలోని హెల్పర్ పోస్టు ఎస్సీ, పోకూరు-2 బీసీడీ, రామచంద్రాపురం జనరల్‌కు రిజర్వు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

● లింగసముద్రం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టుకు ఈనెల 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ ఏపీ రాధాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఓసీకి కేటాయించారన్నారు.

మౌలానా గులాం రసూల్‌కు ఘన నివాళి

● జనాజాను మోసిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


మౌలానా గులాం రసూల్ జనాజా మోస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సీఐ ఫిరోజ్

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాయి వీధిలో ఉన్న అక్సా మసీదు, మదరసా నిర్వాహకుడు, తబ్లీఖ్ జమాత్ జిల్లా బాధ్యుడు మౌలానా గులాం రసూల్‌కు పలువురు ఘన నివాళులు అర్పించారు. గుండె వ్యాధితో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందారు. బుధవారం పార్థీవదేహాన్ని కావలిలోని తన స్వగృహానికి తీసుకువచ్చారు. మృత దేహాన్ని స్థానికులు, స్థానికేతరులు వేలాదిగా తరలివచ్చారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విజయవాడ నుంచి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ముస్లిం సంప్రదాయంలో జనాజా నమాజ్‌లో పాల్గొని జనాజాను తన భుజాలపై మోశారు. అంతిమ యాత్రలో జిల్లా, రాష్ట్రంలోని మతపెద్దలు, ముస్లిం ప్రజలు, ఇతరులు పాల్గొని నివాళులర్పించారు.

దళితులపై దాడులు హేయం


మాట్లాడుతున్న సీపీఎం నేత తాళ్లూరు మాల్యాద్రి

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం కావలి డివిజన్ సీనియర్ నేత తాళ్లూరు మాల్యాద్రి అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితవాడలో బాధితులను బుధవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ సిద్ధనపాలెంకు చెందిన కొందరు తెల్లగుంట దళితులపై దాడులు చేస్తే ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం దారుణం అన్నారు. ఏదైనా సమస్య ఉంటే పెద్దలు, పోలీసుల ద్వారా సామరస్యంగా చేసుకోవాలని, దాడులు చేయడం సరైన పని కాదని ఖండించారు. ఆయన వెంట సీపీఎం నాయకులు తుమ్మల వెంకయ్య, రాధాకృష్ణ, దళిత నేతలు బుర్రి వెంకటరావు, వీరంబొట్లు తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'


సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అరుంధతివాడలో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు టీ.ప్యాట్రిక్, దేవరాల తిరుపతియాదవ్, బుర్రి వెంకటరావు, ఎం.ఇజ్రాయేల్, వీరంబొట్లు, ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో 75 శాతం కేంద్రం నిధులే..

● బీజేపీ నేత కందుకూరి

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 75 శాతం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులేనని బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఓ హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో నాలుగేళ్లలో నూతన ఆవిష్కరణలతో మరిన్ని అభివృద్ధి పనులను రాష్ట ప్రభుత్వం చేపడుతుందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. లక్షలాది కోట్ల నిధులతో జాతీయ రహదారులతో సహా అన్ని రోడ్ల రూపురేఖలు మారనున్నాయన్నారు. నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బెల్లంకొండ మాల్యాద్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రం నెల్లూరులో జరగనున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటకు కావలి నుంచి వేలాదిగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సీవీసీ సత్యం, వీవీ రంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● రెండవ పట్టణ అధ్యక్షుడిగా లక్కరాజు భాస్కర్

కావలి రెండవ పట్టణ బీజేపీ అధ్యక్షుడుగా లక్కరాజు భాస్కర్ నియమితులయ్యారు. పార్టీ తన సేవలను గుర్తించి రెండవ పట్టణ అధ్యక్షుడుగా అవకాశం కల్పించినందుకు కావలితోపాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

తాగునీరు కలుషితం!

● శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ● పొంచి ఉన్న వ్యాధులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు


క్లీనింగ్‌కు నోచుకోని వలేటివారిపాలెంలోని ఓవర్ హెడ్ ట్యాంక్

వలేటివారిపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని చిన్నపాలెం వద్ద ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంక్ శుభ్రతకు నోచుకోవడం లేదు. వాటర్ ట్యాంక్ నిచ్చెన మరమ్మతులకు గురవడంతో ఏళ్ల తరబడి వాటర్‌ట్యాక్‌ను క్లోరినేషన్ చేయలేదు. దీంతో వాటర్‌ట్యాంక్‌లో దుమ్ము దూళి, పిచ్చుకరెట్టలతో పాచిపట్టి అపరిశుభ్రత నెలకొంది. ఫలితంగా తాగునీరు రంగుమారి దుర్వాసన వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీరు తాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రంగుమారి దుర్వాసన వస్తున్న ఈ నీరు వినియోగానికి కూడా పనికిరావని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు ట్యాంక్ నిచ్చెన మరమ్మతులకు రూ.4 లక్షలు నిధులు మంజూరైనప్పటికీ పట్టించుకునేవారే లేరు. వాటర్‌ట్యాంక్‌లో పిడికెడు బ్లీచింగ్ వేసి క్లోరినేషన్ చేసిన దాఖలాలు లేవు. వాటర్ ట్యాంక్‌ను నెలకు రెండుసార్లు క్లోరినేషన్ చేయాలి. అయితే పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. లక్షలు వెచ్చించి వాటర్‌ట్యాంకు నిర్మించారే కానీ ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయలేక పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి మంజూరైన నిధులతో నిచ్చెన మరమ్మతులు చేయించి వాటర్‌ట్యాంక్‌ను బ్లీచింగ్, సున్నంతో క్లోరినేషన్ చేయించి గ్రామస్థులకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ట్యాంక్ నుంచి సరఫరా అయిన రంగుమారిన కలుషిత నీరు

అలరించిన కళా ప్రదర్శనలు

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో బుధవారం కందుకూరులో నిర్వహించిన ప్రజానాట్యమండలి కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులకు స్థానిక సీపీఐ నాయకులు ఘన స్వాగతం పలుకగా పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లలో కళాకారులు గజ్జకట్టి ఆడుతూ కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య మాట్లాడు తూ అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలపక్షాన నిలిచి పోరాటాలు నిర్వహించేది కమ్యూ నిస్టు పార్టీ అని, సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగో లులో జరుగుతున్నందున యువకులు, విద్యావంతు లు, రైతులు, రైతుకూలీలు అధికసంఖ్యలో హాజరై పేదలపక్షాన నిలిచే పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ప్రజానాట్యమండలి కళాజాతా పోకూరు, వలేటివారిపాలెం మీదుగా పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్‌మోహన్, దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, హరిబాబు, నరసయ్య, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టాఫీసు సెంటర్‌లో కళాప్రదర్శన ఇస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు, సీపీఐ నాయకులు

వస్త్ర వ్యాపారంలో కావలికి మినీ ముంబైగా కీర్తి ప్రతిష్టలు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో దొడ్ల రామచంద్రారెడ్డి(డీఆర్), వస్త్రవ్యాపార రంగంలో వైశ్యులు కావలికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని అరుణోదయ క్లాత్ మార్కెట్ 44వ వార్షికోత్సవం బుధవారం ఆ మార్కెట్ సముదాయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వైశ్యులు 44 ఏళ్ల కిందట కావలిలో అరుణోదయ మార్కెట్ సముదాయంను స్థాపించారన్నారు. అందరి ఆదరాభిమానాలు పొందుతూ వస్త్రవ్యాపారాన్ని మరింత విస్తరించి దినదినాభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం అక్కడ జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, వస్త్రవ్యాపారరంగ ప్రముఖులు కందుకూరి వెంకట సత్యనారాయణ, సీవీసీ సత్యం, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో హిరోషిమా డే


మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి

కావలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం హిరోషిమా డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండా రెడ్డిలు మాట్లాడారు. వారు మాట్లాడుతూ జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా వేసిన అనుబాంబుతో జరిగిన నష్టం గురించి వివరించారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు


ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం

లింగసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మల్లికార్జునరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మండలంలో ఆధార్‌కార్డులు లేని గిరిజనులు, గిరిజనేతరులు వినియోగించుకోవాలన్నారు. ఈ కేంద్రంలో కొత్తగా పుట్టిన వారికి ఆధార్ తియ్యడంతోపాటు పాతవారికి మార్పులు చేర్పులు, బయోమెట్రిక్ నమోదు, ఫోన్ నెంబరు లింక్ చేయుంచుకోవచ్చని చెప్పారు. అయితే ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో లింగసముద్రం-1 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ సచివాలయంలో ఆధార్ సేవలు నిలిచి పోయాయి. దీంతో ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుతో మండలంలోని చాలా గ్రామాల ప్రజలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



ఉపాధి నిధులతో పల్లెల్లో ప్రగతి

● బీ.సురేష్, ఎంపీడీవో

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో బీ సురేష్ తెలిపారు.

? పంచాయతీల్లో అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయి.

! మండలానికి మంజూరైన రూ.3 కోట్లు ఉపాధి హామీ పనుల నిధులతో గ్రామాల్లో 42 సిమెంట్ రోడ్లు పూర్తి చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7 లక్షలతో రామాయపట్నం, ఆత్మకూరు, బద్దిపూడి గ్రామాల్లో కల్వర్టులు నిర్మించాం. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు రూ.1.87 కోట్లతో 11 పంచాయతీల్లో సీసీ రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపించాం.

? పంచాయతీల ఆదాయం పెంపునకు చేపడుతున్న చర్యలు ఏమిటి.

! ఉలవపాడు, కరేడు వంటి మేజర్ పంచాయతీల్లో ఇల్లు, కుళాయి పన్నుల రూపంలో, తీర ప్రాంతంలో హేచరీలు, జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలు, పెట్రోల్ బంకుల నుంచి ఆదాయం సమకూరుతుంది. చిన్న పంచాయతీల్లో పన్నుల రూపంలో స్వల్ప ఆదాయం వస్తుంది. జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుద్ధ్యం, మంచినీటి వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం.

? సచివాలయ ఉద్యోగులను సక్రమంగా ఉపయోగించుకుంటున్నారా.

! వలంటీర్ల వ్యవస్థ లేనందున ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకం ఆన్‌లైన్ పనులు సచివాలయం సిబ్బంది చేతనే చేయిస్తున్నాం. సకాలంలో పించన్లు పంపిణీ, జియోట్యాగ్, హౌస్‌హోల్డ్ సర్వే, ఆధార్ క్యాంపులు వంటి విధులు చేయిస్తున్నాం.

? సచివాలయాల అనుబంధ భవనాలను ఉపయోగంలో ఉన్నాయా.

! గ్రామ సచివాలయాల అనుబంధ భవనాలను ఆయా శాఖల పరిధిలో ఉపయోగించుకుంటున్నారు. పూర్తయిన రైతు సేవా కేంద్రాలను, హెల్త్ సెంటర్లు ఉపయోగంలో ఉన్నాయి.

? సచివాలయాల్లో అన్ని రకాల సేవలు అందిస్తున్నారా.

! సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు


లింగసముద్రం : బాలామృతం అందజేస్తున్న రాధాదేవి


వలేటివారిపాలెం : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ ఏపీ రాధాదేవి చెప్పారు. బుధవారం మండలంలోని పెదపవని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం కొందరు గర్భిణులకు సీమంతం చేశారు. తల్లులకు బాలామృతం పాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి) :** బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కొండసముద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

● **కలిగిరి(ఆంధ్రజ్యోతి):** మండలంలోని రావులకొల్లులో బుధవారం తల్లిపాల వారోత్సవాలలు నిర్వహించారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాలామృతం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిలక్ష్మి, ఎంపీహెచ్‌ఏ(యం) రియాజ్‌బాషా, ఏఎన్ఎం లక్ష్మి, ఆశావర్కర్ సురేష్, సర్పంచు వెంగపనాయుడు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి : గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయిలక్ష్మి

చుండూరు మృతవీరులకు ఘన నివాళి

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా చుండూరు దళిత మృత వీరులకు బుధవారం కందుకూరులో వివిధ దళిత సంఘాల నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దళిత నాయకులు మాట్లాడుతూ 1991లో చుండూరులో అగ్రకులాలు మాలపల్లెపై దాడిచేసి పోలీసుల సహకారంతో 9మంది మాలలను బరిసెలతో పొడిచి కత్తులతో నరికి అతిక్రూరంగా చంపేశారన్నారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న విద్యార్థికుడు కొమెర్ల అనిల్‌కుమార్‌ను ఎస్పీ మీనా కాల్చి చంపడం అప్పటి దమనకాండకు నిదర్శనమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘోరకలిని చూసిన రమేష్ గుండెపోటుతో మృతిచెందగా మృతదేహాల పోస్టుమార్టం చేసిన డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడని రిపోర్టు ఇచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు లింగాబత్తిన బ్రహ్మయ్య, రేణమాల అయ్యన్న, పాలేటి కోటేశ్వరరావు, డీసీహెచ్ మాలకొండయ్య, మాధవరావు, హరిప్రసాద్, గేరా చిరంజీవి, బత్తల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత సంఘాల నేతలు

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా మగ్గం నేసినా రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదు. నేసిన చీరలకు మార్కెట్ లేకపోవడంతో మాస్టర్ వీవర్స్ ధరలు బాగా తగ్గించారు. గిట్టుబాటు కాక మరో పని చేయలేక చాలీచాలని కూలితో కుటుంబాన్ని పోషిస్తున్నాం

- ఏ శ్రీనివాసులు, నేత కార్మికుడు, సంగం

ముడి నూలుపై రాయితీ ఇవ్వాలి



ముడి నూలుపై గతంలో రాయితీలు ఇవ్వడం వల్ల ఏడాదికి సుమారు రూ.50 వేలు లబ్ధి చేకూరేది. దీంతో శ్రమకు తగ్గ కూలి గిట్టుబాటు అయ్యేది. అయితే, గత ప్రభుత్వం రాయితీ, సంక్షేమ పథకాలు రద్దు చేసింది. దీంతో ఆదాయం కోల్పోయాం.

- రంగనాయకమ్మ, చేనేత కార్మికురాలు, సంగం

మార్కెట్ వసతి కల్పించాలి



నేతన్నకు పెట్టుబడి ఇచ్చి ఉత్పత్తి చేసిన చీరలకు మార్కెట్ వసతి కల్పించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో రైతు బజార్లు ఏర్పాటు చేసినట్లు చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి. అందులో కార్మికులే నేసిన చీరలను విక్రయించే అవకాశం కల్పించాలి. రాయితీపై ముడినూలు సరఫరా చేయాలి.

- మాగం గిరి, చేనేత కార్మికుడు, సంగం

పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరు గ్రామంలో రూ.76 లక్షల వ్యయంతో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాటూరులో చేనేతల ఉత్పత్తులు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో చేనేతలు ఆనందపడుతున్నారు. ఇప్పటికే పాటూరు, గుమ్మళ్లదిబ్బ ప్రాంతాల నుంచి 175 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి రూ.30లక్షల మేర నిధులను కేటాయించారు. వారిలో 85మందికి స్టాండ్‌మగ్గాలు, జాకార్డ్ మిషన్లను అందచేశారు. అందరికీ యంత్రాలతో నడిచే రాట్నాలు అందించనున్నారు. రూ.12 లక్షలతో షెడ్డు నిర్మించేందుకు ముగ్గురికి నిధులు మంజూరు చేశారు.

ఎంతో ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు రాయితీలు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవడం అభినందనీయం. ఎప్పటినుంచో చేనేతల బతుకుల్లో వెలుగు నింపమని కోరుతున్నాం. చేనేత దినోత్సవం నాడు నేత వస్త్రాలనే ధరించాలని అంతా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

-కేవీ శేషయ్య, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

నేడు జాతీయ చేనేత దినోత్సవం

వెంకటగిరి నేతకు జాతీయ ఖ్యాతి

- 6వ పేజీలో -



మగ్గం గుంటలోంచి మహాద్భుతాలు సృష్టిస్తారు. గుడ్డమీద కళాఖండాలను చిత్రిస్తారు. పడుగూ,పేకల నడుమ ఆకలి కేకలు దాచిపెట్టుకుంటారు. తరం నుంచి తరానికి వారసత్వంగా చేనేతను అందిస్తారు. వెంకటగిరి చేనేత కళాకారుల నైపుణ్యానికి ఫ్యాషన్ ప్రపంచం సలాము చెబుతుంది. కాటన్, పట్టు చీరలకే పరిమితం కాకుండా ఇంటి గోడలమీద వేలాడే చిత్రాలను సైతం గుడ్డమీద నేసి జాతీయ అవార్డులనే అందిపుచ్చుకుంటున్నారు తిరుపతి జిల్లా వెంకటగిరి చేనేతన్నలు.

రైలు ప్రయాణికురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

● ప్రతిఘటనలో బాధితురాలి చేతికి గాయం

పాకాల, ఆగస్టు 6: రైలులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన బుధవారం పాకాల రైల్వే స్టేషన్‌లో జరిగింది. తిరుపతికి చెందిన జి.కవిత మదనపల్లి ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తారు. రోజూ రైలులో డ్యూటీకి వెళ్లొస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం గుంటూరు-మదనపల్లె ఎక్స్‌ప్రెస్ రైలులో ఖాళీగా ఉన్న బోగీ ఎక్కారు. ముంగిలిపట్టు రైల్వే స్టేషన్ దాటాక ఇద్దరు యువకులు బోగిలో చొరబడ్డారు. వెంటనే కత్తి తీసి వారు కవితను బెదిరించి మెడలోని 64 గ్రాముల బంగారు చైను లాక్కొన్నారు. ఈ ఘటనలో ప్రతిఘటించిన ఆమె కుడిచేతికి గాయమైంది. పాకాల సమీపాన రైలు నెమ్మదిగా వెళ్తుండగా వారు దిగి పారిపోయారు. చిత్తూరు జీఆర్పీ ఎస్ఐ రత్నమాలకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షేమంగా అక్క వద్దకు..!



ఇంటికి చేరుకున్న వెంకటరావు

● నెలిమర్లకు చేరుకున్న వెంకట్రావు
● భావోద్వేగంతో కన్నీటి పర్యంతం
● 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబీకులు

నెలిమర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నెలన్నర తర్వాత వెంకటరావు అక్కను చేరుకున్నారు. తిరుపతి నుంచి మంగళవారం కారులో బయలుదేరిన ఆయన.. బుధవారం ఉదయం 7.30 గంటలకు విజయనగరం జిల్లా నెలిమర్లలోని బృందావన కాలనీలో ఇంటికి వచ్చారు. అక్క అరుణాపాఢిక్‌ను చూడగానే ఆనందాశ్రువులతో పలకరించారు. ఓ పక్క దుఃఖం.. మరోపక్క ఆనందం కలగలిపిన భావోద్వేగంతో ఇద్దరికీ కాసేపు నోటిమాట రాలేదు. 'ఆంధ్రజ్యోతి' వల్లే తాను అక్క వద్దకు చేరగలిగానని, పునర్జన్మను ప్రసాదించిందంటూ వెంకటరావు పదే పదే కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగకు తమ్ముడిని ఆ దేవుడే ఇంటికి పంపాడంటూ అరుణాపాఢిక్ సంతోషం వ్యక్తంచేశారు. సహకారం అందించిన 'ఆంధ్రజ్యోతి'కి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడికి కృతజ్ఞతలు తెలిపారామె. అనంతరం వెంకటరావును అక్క, బావ లోపలకు తీసుకెళ్లి సపర్యలు చేసి అల్పాహారం అందించారు. ఇంతలో నగర పంచాయతీ కమిషనరు జయరాం, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. పలువురు నేతలు, అధికారులు ఆయన్ను కలిసి మాట్లాడారు.

CTBTA DATE 07-08-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 95/- డ్రెస్డ్ స్కిన్‌తో 175/-
రిటైల్ లైవ్ బర్డ్ 115/- స్కిన్‌లెస్ 195/-

వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లకు ఇచ్చిన ఐరిస్ స్కానర్లు ఎక్కడ ఉన్నాయి? కమిషనరు ఆదేశాలతో ప్రస్తుతం సివిల్ సప్లయిస్ డీటీలు వెదకులాట మొదలు పెట్టారు. జిల్లాకు సంబంధించి 32 వరకు వెనక్కి రానట్లు తెలిసింది. దీంతో అధికారులు వీటిని తెప్పించే పనిలో పడ్డారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఆ ఐరిస్ స్కానర్లు ఎక్కడ?



● జిల్లాలో ఆచూకీ లేని 32 మిషన్లు
● వాపసు చేయకుంటే రూ.6400 చెల్లించాలని ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశాలు


వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరుకులు పంపిణీ చేసే సందర్భంగా కొందరు వృద్ధులు, దివ్యాంగులకు వేలి ముద్రలు పడక ఇబ్బందులు ఎదురయ్యాయి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం జిల్లాకు దాదాపు 230 ఐరిస్ స్కానర్లను పంపిణీ చేసింది. ప్రస్తుతం పాత పద్ధతిలో డీలర్ల వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఐరిస్ స్కానర్ల అవసరం లేదు. ఇక, ఎండీయూ ఆపరేటర్లూ లేరు. ఈ క్రమంలో వారికిచ్చిన ఐరిస్ స్కానర్లు ఏమయ్యాయని జిల్లాలో అధికారులు పట్టించుకోలేదు. వాటిని ఎండీయూ ఆపరేటర్లు ఎక్కడ ఉంచారో అడగలేదు. ఈ క్రమంలో అన్ని ఐరిస్ స్కానర్లను వెనక్కు తీసుకోవాలంటూ కమిషనరు నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు ఎండీయూ ఆపరేటర్లను వెతికే పనిలో పడ్డారు. అందుబాటులో ఉన్నవారు.. వారి వద్ద ఉన్న పరికరాలను వెనక్కి తీసుకుని జిల్లా కార్యాలయంలో భద్రపరచారు. ఇంకా 32 కనిపించడం లేదని సమాచారం. కొందరు ఎండీయూ అపరేటర్లు బాధ్యత లేకుండా వాటిని మూలన పడేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇక, ప్రభుత్వం సరఫరా చేసిన ఐరిస్ స్కానర్లు, డివైజ్‌లను ఎండీయూ ఆపరేటర్లు వెనక్కు ఇవ్వకుంటే వాటి కోసం తక్షణం రూ.6400 చెల్లించాల్సిందేనని అధికారులు ఆదేశించారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 210 మంది ఐరిస్ కెమెరాలు అప్పగించగా మిగిలిన వారు వాపసు చేయలేదు. ఒకవేళ డివైజ్ అప్పగించకుంటే ప్రభుత్వానికి రూ.6400 చెల్లించాల్సిందేనని అధికారులు ఆపరేటర్లకు స్పష్టంచేస్తున్నారు. లేదంటే వాహనానికి, ఎన్‌ఓసీకి లింకు పెట్టే అవకాశం వుందని హెచ్చరిస్తున్నారు. అప్పట్లో రూ.6.4 లక్షల వాహనాన్ని 10 శాతం లబ్ధిదారుడి వాటాతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణం మంజూరు చేశారు. ఇప్పటికే నాలుగన్నరేళ్లకు పైగా ఈఎంఐలు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులకు చెల్లించి క్లియరెన్సు ఇవ్వాల్సి వుంది. ఈ క్రమంలో భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎండీయూ ఆపరేటర్లు తక్షణం ఐరిష్ స్కానర్లు అప్పగించాలని సీఎస్‌డీటీలు ఆదేశాలు జారీ చేశారు.

పవిత్రం సమర్పయామి





ఉత్సవర్లకు పూజా కార్యక్రమం - శ్రీవారి ఆలయంలో పవిత్రాల ఊరేగింపు



ధ్వజస్తంభానికి పవిత్ర మాల కట్టుతున్న అర్చకులు

పవిత్రోత్సవాల్లో రెండో రోజైన బుధవారం శ్రీవారి ఆలయంలో పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీవారి మూలవర్లతో పాటు ఆలయం లోపల, వెలుపల వివిధ దేవతామూర్తులకు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

పవిత్రమాలల తయారీ ఇలా..

పవిత్రాలు చేయడానికి శ్రేష్ఠమైన జాతి పత్తి మొక్కలను.. తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచతారు. మాలల తయారీకి 20 మూరల పట్టుదారం లేదా 200 మూరల నూలుదారం కానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకపచ్చ, పసుపపచ్చ రంగులు అద్దతారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

బాలాయపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం జయంపు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు అనగాని చినఅంకయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. పాఠశాల వేళల్లో ఆయన మద్యం తాగి విధులకు వస్తున్నారని, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తల్లితండ్రులు ఎంఈవో ప్రదీప్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఎంఈవో విచారించి ఇచ్చిన వివరాల మేరకు అంకయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



ధాన్యం ధర పతనం

● గతేడాదితో పోలిస్తే బస్తాకు రూ.310 తక్కువ
● తీవ్రంగా నష్టపోతున్న రైతు

పెళ్లకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కన్నా తవుడు ధరే ఎక్కువ. అవును ఇది నిజం. ప్రస్తుతం మార్కెట్లో 80 కిలోల ఎంటీయూ 1010 రకం ధాన్యం బస్తాకు రూ.1300 రైతులకు చెల్లిస్తున్నారు. అదే ధాన్యాని మిల్లర్లో ఆడాక వచ్చే తవుడును మాత్రం పాడి రైతులకు 50 కిలోల బస్తా రూ.1350కి విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి ఎందుకంటే.. రైతులకు ఎంటీయూ 1010 వరి రకం సాగు లాభదాయకంగా ఉంటుంది. ఈ రకం ధాన్యం సాగు చేయొద్దని గత ప్రభుత్వం ఎందుకు ప్రకటించిందో తెలియదు. కానీ, ఖరీఫ్ సీజన్‌లో రెండో కారు పంట సాగుకు చీడపీడలను తట్టుకుని నిలబడేది మాత్రం ఎంటీయూ 1010 వరి రకం మాత్రమే. ఈ రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుకు అనుమతి..మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారులు వారికి ఇష్టమొచ్చిన ధరకు కొంటున్నారు. గతేడాది ఇదే ఎంటీయూ 1010 రకం ధాన్యం 75కిలోల బస్తా రూ.1610 పలకగా,ఈ ఏడాది రూ.1300 మించడంలేదు. దీనికి తోడు గతేడాది కంటే ఈ ఏడాది పెట్టుబడులు భారీగా పెరిగాయి. సాధారణంగా ఒక ఎకరా సాగుకు రూ.25 వేలు ఖర్చవుతుండగా ప్రస్తుతం రూ. 35 వేలు దాటిందని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో గతేడాదికన్నా బస్తాపై రూ.310 ధర తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం 'మద్దతు' ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పర్యాటక శాఖ, టీటీడీ నడుమ

25 ఎకరాల భూమి బదలాయింపు

ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంచడంతో 2 వేల సెలూన్లకు లబ్ధి
తిరుపతి రెడ్ శాండర్స్ కోర్టుకు ఏపీపీ పోస్టు మంజూరు
జిల్లాకు సంబంధించి మంత్రిమండలి నిర్ణయాలు

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పర్యాటక శాఖ, టీటీడీ నడుమ 25 ఎకరాల భూమి బదలాయింపునకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రిమండలి జిల్లాకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకుంది. తిరుపతి అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో ఏపీ పర్యాటక శాఖకు చెందిన 25 ఎకరాల భూమిని ఒబెరాయ్ తదితర హోటళ్ల నిర్మాణానికి కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే అలిపిరిలో శేషాచల పర్వత పాదాల చెంత హోటళ్ల నిర్మాణానికి పలు సంస్థలు అభ్యంతరం తెలిపాయి. తిరుమల పవిత్రత దెబ్బతింటుందనే అభ్యంతరాల నడుమ టీటీడీ పాలకమండలి సైతం ఓ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపింది. దీంతో సీఎం చంద్రబాబు ఈ భూమి కేటాయింపులపై దృష్టి సారించారు. అలిపిరి సమీపంలో టీటీడీయేతర సంస్థలకు భూమి కేటాయింపులు జరపరాదని నిర్ణయించారు. ఆ మేరకు అప్పటికే పర్యాటక శాఖ అక్కడ పాతిక ఎకరాల భూమిని ఒబెరాయ్ తదితర సంస్థలకు కేటాయించిన క్రమంలో ఆ కేటాయింపులను రద్దే చేసింది ప్రభుత్వం. తాజాగా పర్యాటక శాఖ ఆధీనంలోని 25 ఎకరాల భూమిని టీటీడీకి కేటాయిస్తూ దానికి ప్రతిగా అక్కడికి సమీపంలోని టీటీడీకి చెందిన భూమిని పర్యాటక శాఖకు కేటాయించే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది.

● నాయీ బ్రాహ్మణ సంఘాల వినతి మేరకు ప్రభుత్వం ఇప్పటి దాకా హెయిర్ కటింగ్ సెలూన్లలో నెలవారీ 150 యూనిట్ల వరకూ ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్ల వరకూ పెంచేందుకు మంత్రిమండలి ఆమోదించింది. దీంతో జిల్లాలోని 2 వేల హెయిర్ కటింగ్ సెలూన్ల నిర్వాహకులకు లబ్ధి కలగనుంది.

● తిరుపతిలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణకు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ స్థాయి కలిగిన ప్రత్యేక కోర్టు ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ కోర్టులో కేసులకు సంబంధించి ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు అదనపు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టు మంజూరుకు మంత్రిమండలి ఆమోదించింది.

రేపు పద్మావతి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

● నేడు టిక్కెట్ల విక్రయం



భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న జర్మన్ షెడ్లు

తిరుచానూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 30వేలమంది అమ్మవారి దర్శనానికి వస్తారని అంచనా.
ఈ నేపథ్యంలో అన్నప్రసాదాలతోపాటు మౌలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు. గేట్‌నెంబరు 4 (పాత పోలీస్‌స్టేషన్) వద్ద భక్తులు వేచి ఉండేందుకు జర్మన్ షెడ్లు, అక్కడి నుంచి ఆలయంలోకి వెళ్లడానికి క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆస్థాన మండపంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా వరలక్ష్మీ వ్రతం జరగనుంది. ఇప్పటికే ఆస్థాన మండపాన్ని ముస్తాబు చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విడుదల చేయగా.. గురువారం ఉదయం అమ్మవారి ఆలయ కుంకుమార్చన కౌంటర్‌లో కరెంటు బుకింగ్ ద్వారా 150 టిక్కెట్లను ఇవ్వనున్నారు. శుక్రవారం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. సర్వదర్శనం మినహా ఎలాంటి సేవలు ఉండవని అధికారులు తెలిపారు. వ్రతం ముగిశాక సాయంత్రంపైన భక్తుల సంఖ్య తగ్గితే రూ.100, రూ.200 దర్శనం టిక్కెట్లు విక్రయించాలని యోచిస్తున్నారు. ఆరోజు సాయంత్రం అమ్మవారి స్వర్ణరథోత్సవం జరగనుంది.



ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు

Heritage FINLEASE హెరిటేజ్ ఫిన్‌లీజ్ లిమిటెడ్
ప్లాట్ నం.83, సర్వే నం.43 నుండి 46 & 48, ద్వారకా సమ్మిట్, కావూరిహిల్స్, హైదరాబాద్, తెలంగాణ - 500033, ఇండియా
సవరణ
1. శ్రీ ప్రదీప్ డి. పూజార్ తండ్రి స్వర్గీయ దత్తాత్రేయ బాలకృష్ణ పూజార్, 2. శ్రీ ప్రదీప్ డి. పూజార్ తండ్రి స్వర్గీయ దత్తాత్రేయ బాలకృష్ణ పూజార్ (స్వర్గీయ శ్రీమతి పి.డి. ప్రేమావతి న్యాయవారసులు) భర్త స్వర్గీయ దత్తాత్రేయ బాలకృష్ణ పూజార్ (రుణగ్రహీతలు)చే తనఖాపెట్టబడిన ఆస్తి అమ్మకానికి సంబంధించి 05.08.2025 తేదీగల వేలం ప్రకటనకు నిర్దేశముతో దిగువ సంతకందారుచే జారీచేయబడిన, ఆంధ్రజ్యోతి మరియు హిందూ దినపత్రికలలో 06.08.2025న ప్రచురితమైన వేలం ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1)తో చదువబడు రూల్ 8(6)కు నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద జారీచేయబడినదని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలకు మరియు హామీదారుకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
తేది : 06.08.2025
ప్రదేశం : హైదరాబాద్
అధీకృత అధికారి
హెరిటేజ్ ఫిన్‌లీజ్ లిమిటెడ్





ఆలయం ముందు కుమారుడు రిత్విక్‌తో రమ్యకృష్ణ - ప్రేమ్ సింగ్ తమంగ్

ప్రముఖ సినీనటి రమ్యకృష్ణ కుమారుడు రిత్విక్ వంశీతో కలిసి బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అలాగే సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్, కర్ణాటక హోంమంత్రి గంగాధరయ్య పరమేశ్వర, సినీనటి సత్యశ్రీ కూడా బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు తలకోనలో వన్యప్రాణి,అటవీ సంరక్షణపై సమావేశం

ఎర్రావారిపాళ్యెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తలకోనలో వన్యప్రాణి, అటవీ సంరక్షణపై గురువారం జిల్లా స్థాయి సమావేశం జరగనుంది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పాల్గొంటారు. అటవీ, వన్యప్రాణులు సంరక్షణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. శేషాచలంలోని తలకోన జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ అభయారణ్యంలో వన్యప్రాణుల వేటను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. వివిధ సందర్భాల్లో 49 ఏనుగులు ఇప్పటివరకూ మృత్యువాత పడ్డాయి. విద్యుత్ తీగలు తగలడం, అనారోగ్యం, ప్రమాదకర బావుల్లో పడడం లాంటి కారణాలతో ఇవి చనిపోతున్నాయి. అదే సమయంలో తమపంటను కాపాడుకునే క్రమంలో ఏనుగుల దాడిలో పలువురు రైతులు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిహారం వేగంగా అందుతోందని బాధిత రైతులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం జరగనుంది.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,951


తలనీలాలు సమర్పించినవారు: 27,143



వెంకటగిరి కళనేత

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరి అనగానే చేనేత గుర్తుకొస్తుంది. మూడు వందల ఏళ్లకు పైగా చేనేత చరిత్ర గలిగిన ఊరు ఇది. 1600, 1700 మధ్య కాలంలో వెంకటగిరి రాజకుటుంబం చేనేత కళాకారులను దూర ప్రాంతాల నుంచి వెంకటగిరికి తీసుకువచ్చారని చెబుతారు. ఏటా రాజులు నిర్వహించే కుస్తీ పోటీల్లో విజేతలకు వెండి జరీతో నేసిన కండువా కప్పేవారు. నేత తలపాగా చుట్టేవారు. వీటిని స్థానికంగానే నేసేవారు. వెంకటగిరి రాజకుటుంబం వస్త్రాలన్నీ ఇక్కడే నేసేవారు. 50 ఏళ్ళ కిందటే వెంకటగిరికి చెందిన నేత కళాకారుడు బత్తిన వెంకటసుబ్బయ్య బెంగుళూరు చేనేత సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తూ అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసి చరిత్ర సృష్టించారు. ఈ చేనేత కళా సంప్రదాయం ఇప్పటికీ వెంకటగిరిలో కొనసాగుతోంది. చీరలు, డ్రెస్‌లతో పాటూ అద్భుత చిత్రాలను వస్త్రంపై నేసి ఆశ్చర్యపరుస్తున్నారు. ఆధునిక సాంకేతికతనూ నేతకు ఈతరం కళాకారులు జోడిస్తున్నారు. వెంకటగిరి నుంచే 12 మంది చేనేత కళాకారులు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఐదుగురిని సంత్‌కబీర్ అవార్డులు కూడా వరించాయి. ఇక జాతీయ మెరిట్ పురస్కారాలను ఇద్దరు అందుకున్నారు. వెంకటగిరి చేనేతకు వన్నె తెస్తున్న కొంత మంది నేత కళాకారుల పరిచయం.. చేనేత దినోత్సవం సందర్భంగా..



వన్నె తెచ్చిన కళాకారులకు వందనం

జాతీయ అవార్డులు అందుకున్నవారు 12 మంది

ఐదుగురిని వరించిన సంతకబీర్ పురస్కారాలు

ఇద్దరికి జాతీయ మెరిట్ సర్టిఫికెట్లు



కూనా మల్లిఖార్జున్:

12వ ఏట నుంచే మగ్గంలో దిగిన కూనా మల్లిఖార్జున్ 8వ తరగతి వరకే చదువుకున్నారు. సంప్రదాయ నేత విధానానికి ఆధునిక సాంకేతికత జోడించాలన్న ఉత్సాహం ఈయనది. నేతను మరింత సులువు చేయాలన్న ఆలోచనతో చెన్నై, మదురై వంటి ప్రాంతాల్లో తిరిగి స్టాండ్ మగ్గాల పై పట్టు సాధించారు. జాకార్డు , డాబీ, పైటపేటు, అంచు పేటు నేయడంలో సులువైన పద్ధతులు అవలంబిస్తున్నారు. 1996లో పెళ్ళి సాంప్రదాయం ఉట్టి పడేలా నేసిన చీరకు జాతీయ అవార్డు లభించింది. అలాగే రెండు నెలల శ్రమతో నేసిన ట్రీ ఆఫ్ లైఫ్ కి సంత్‌కబీర్ అవార్డును అందుకున్నారు.

> నేతకు నూతన సాంకేతికతను జోడించడం అవసరం. నేను తిరిగి నేర్చుకున్నది వంద మందికి నేర్పించా. నా శిష్యులు కూడా జాతీయ అవార్డులు అందుకున్నారు. ఉత్సాహం కన్నా బతుకు ముఖ్యం కదా. నేను కూడా ఇప్పుడు మార్కెట్‌లో డిమాండ్ ఉండే చేరలకే పరిమితం అయ్యా.







> నేను నేసిన నేత చిత్రానికి ఇక్కడి వారు రూ 10 వేలు వెలకట్టారు. అదేచీర బాంబే ఎగ్జిబిషన్‌లో రూ 4లక్షలు పలికింది. నూతన డిజైన్‌లు అమ్ముకొనేందుకు ప్రభుత్వం వేదిక ఏర్పాటు చేయాలి.

లక్కా శ్రీనివాసులు: గోకులంలో బృందావనం డిజైన్ నేసినందుకు 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న లక్కా శ్రీనివాసులు పదవ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. గోడమీద వేలాడదీసే ఈ అందమైన చిత్రం నేయడానికి రెండు నెలలు పట్టింది. అలాగే ఈయన నేసిన లక్ష్మీవృక్షం చిత్రానికి సంత్‌కబీర్ అవార్డును ప్రకటించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల ప్రస్తుతం లక్ష్మీ వృక్షం వాల్ హ్యాంగింగ్ సంతకబీర్ అవార్డుకు ఎంపికైంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదాని చేతుల మీదుగా ఢిల్లీలో ఈ పురస్కారం అందుకోబోతున్నారు. ఈ చిత్రం నేయడానికి నాలుగు నెలలు పట్టింది.



పట్నం మునిరాజా: 8వ ఏట నుంచే చేనేత వృత్తిలో ఉన్న ఈయన 9వ తరగతికే చదువుకు టాటా చెప్పేసారు. తండ్రి లాగే కొత్త డిజైన్లు నేయాలన్న తపనతో తీగలపై చిలుకలు డిజైన్‌ను చీరకు రెండు వైపులా వచ్చేలా నేసారు. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. నాలుగు నెలలు ఇందుకోసం శ్రమించారు.

> యువతలో చేనేతపై ఆసక్తిని పెంచాలన్నది నా కోరిక. కొత్త డిజైన్ల నేతపై వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం సహకరిస్తే ఈ పని చేయాలని ఉంది.







పట్నం చీరాలరెడి :

బడి చదువులకన్నా విలువైన విద్య కళ రూపంలో ఈయనకు అబ్బింది. 2015లో మూడు నెలల కష్టం, రూ 70 వేల ఖర్చుతో నదీతీరంలో శ్రీకృష్ణ బలరాములు గోవులు మేపే డిజైన్ నేసినందుకు జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే 2017ఓ అనంత పద్మనాభస్వామి చిత్రానికి రాష్ట్రపతి చేతుల మీదుగా సంతకబీర్ అవార్డు అందుకున్నారు.

> మా అబ్బాయితో పాటూ 45 మందికి చేనేతపనిలో శిక్షణ ఇచ్చా. నా శిష్యులు కూడా కొత్త డిజైన్లు నేస్తున్నారు. ఎప్పటికైనా పద్మశ్రీ వరిస్తుందనే నమ్మకంతో ఉన్నా.

సజ్జా వీరయ్య

మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేసిన ఈయన 7వ ఏట నుంచే చేనేతలో ఉన్నారు. 2000లో నాలుగు నెలలు కష్ట పడి నేసిన పురివిప్పిన నెమలి డిజైన్ చీర జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ చేతులు మీదుగా అవార్డు అందుకోవడం మరచిపోలేని అనుభవం అంటున్నారు ఈయన.

> ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చేనేతకు దూరమయ్యా. ప్రభుత్వం చేయూతనిస్తే చేనేతలో కొత్త ఒరవడి తీసుకు వచ్చేలా యవతను తయారు చేస్తా.



బోగా రాము

రాము 12 ఏళ్ల వయసు నుంచే నేతపనిలో ఉన్నారు. చదువుకున్నది 6వ తరగతి దాకానే. ఇంటి పరిస్థితులు అనివార్యంగా మగ్గం గుంటలో దించేశాయి. కొత్త డిజైన్లు నేయాలనే ఉత్సాహమే ఈయనకు 1999లో అప్పటి ఉపరాష్ట్రపతి కృష్ణ కాత్ చేతులు మీదుగా జాతీయ అవార్డు అందుకునేలా చేసింది. కర్పూరం డిజైన్ చీరకు ఈ పురస్కారం లభించింది.

> మా నాయన కల జాతీయ అవార్డు సాధించాలన్నది. ఆయనకు సాధ్యం కాలేదు. నేను సాధించి ఆయనకు అంకిత మిచ్చా."





గౌరాబత్తిన రమణయ్య:

బాల్యంలోనే మగ్గం పని నేర్చుకున్నారు. అప్పట్లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 81 ఏళ్ల వయసులోనూ మగ్గం నేస్తారు. తీగల్లో అమరిన చిలుకలు డిజైన్‌కు జాతీయ అవార్డు లభించింది. దీనిని నేయడానికి 75 రోజులు పట్టింది.





పట్నం మునిబాబు :

4వ తరగతికే చదువు ఆపేసి చేనేతలోకి దిగిన మునిబాబు ఈ కళలో రాణిస్తున్నారు. ఈయన నేసిన గోవర్ధనగిరి డిజైన్ చీరకు జాతీయ అవర్డు లభించింది. ఈ చీర నేయడానికి నాలుగు నెలలు పట్టింది.



సంస్కృత భాషా వారోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

సమాజానికి సంస్కృతం దిక్సూచి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సంస్కృతం దిక్సూచి అని అక్షర పురుషోత్తదామం(ఢిల్లీ) అధ్యక్షుడు భద్రేశదాస స్వామి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత భాషా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం చెలికాని అన్నారావు భవనంలో జరిగిన కార్యక్రమంలో భద్రేశదాసు స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఇణ్ణికా వీసీ నాగరాజు మాట్లాడుతూ.. భారతీయ విజ్ఞానానికి మూలం సంస్కృతమన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృత భాషను మరింతగా వ్యాప్తి చేయడానికి కృషి జరగాలన్నారు. ప్రఖ్యాత సంస్కృత ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎడ్యుకేషన్ విభాంలో అత్యాధునిక క్లాస్‌రూములను వీసీ కృష్ణమూర్తి ప్రారంభించారు. కాగా సంస్కృత యూనివర్సిటీలో గోవింద భగవత్పాదాచార్యుల వాక్యర్థ సభలో భద్రేశదానస్వామి, వీసీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొని మాట్లాడారు.

టీటీడీ డీఎఫ్‌వోకు అదనపు బాధ్యతలు

తిరుమల, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌చార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు జీఎంగా ఉన్న శేషారెడ్డి కొన్నేళ్లుగా ఐటీ ఇన్‌చార్జ్ జీఎంగా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల డిప్యూటేషన్‌పై టీటీడీ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమితులైన ఫణికుమార్ నాయుడికి ఐటీ ఇన్‌చార్జ్ జీఎంగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అగ్రిగోల్డ్ భూములను పరిశీలించిన సీఐడీ అధికారులు

దొరవారిసత్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం అక్కరపాక రెవెన్యూ పరిధిలో ఉన్న 108 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను బుధవారం తిరుపతి సీఐడీ అధికారులు పరిశీలించారు. నెల్లూరు సీఐడీ ఆర్‌వో పరిధిలో ఉన్న ఈ భూములను తిరుపతి సీఐడీ ఆర్‌వో పరిధిలోకి తీసుకోవడంతో అధికారులు భూములను పరిశీలించారు. సీఐడీ సీఐ రంగస్వామి, ఎస్‌ఐ ధరణీధర్, సిబ్బంది, స్థానిక వీఆర్‌వో జ్ఞానేంద్రతో కలిసి భూములను పరిశీలించారు. ఇక్కడ భూములను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు సీఐడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అగ్రిగోల్డ్ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐడీ అధికారులు చెప్పారు.

అమ్మవారికి కానుకగా వెండి దీపాలు



వెండి దీపాలను అందజేస్తున్న రమణారావు

తిరుచానూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి కెనడాకు చెందిన రమణారావు బుధవారం రూ.6లక్షల విలువ చేసే వెండి తుంగవాళి దీపాలను ఆలయ అధికారులకు అందజేశారు. 4.14 కిలలో బరువుగల తుంగవాళి (వేలాడే దీపాలు)ని అర్చకుడు బాబుస్వామి, ఏఈవో దేవరాజులు, ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సకాలంలో విద్యా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని జేసీ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలున్నాయని, విద్యకు సంబంధించిన రుణాలకు ప్రత్యేక ప్రాధాన్యతతో మంజూరు చేయాలని అన్నారు. పీఎంఈజీసీ పథకం కింద మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా రుణాలు బ్రాంచ్‌ల వారీగా లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. రైతులకు క్రాప్‌లోను మంజూరు చేసే సమయంలో పంటలకు ఇన్సూరెన్సు చేయించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, వ్యవసాయశాఖ పీడీ ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్రబాబు, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ సామంచి శర్మ, ఎల్డీఎం రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా భవానీ ప్రసాద్

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా పి.భవానీప్రసాద్ నియమితులయ్యారు. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను ప్రస్తుతం ఖాళీగా ఉన్న శ్రీకాళహస్తి కమిషనర్ పోస్టులో నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈటీసీలో ఏవోగా మధుసూదన్

శ్రీకాళహస్తిలోని ఈటీసీ (ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ (అగ్రికల్చర్ ఆఫీసర్) పోస్టులో ఏ.మధుసూదన్ నియమితులయ్యారు. వరదయ్యపాళెం మండలంలో ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం డెప్యుటేషన్‌పై ఈటీసీ ఫ్యాకల్టీగా నియమించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిబంధనల మేరకే వినాయక విగ్రహాల ఏర్పాటు

- డీజే సౌండ్లు, సినిమా పాటలతో ఇబ్బందిపెడితే చర్యలు
- ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక విగ్రహాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా తిరుపతిలో విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలతోపాటు ఊరేగింపుగా వెళ్లే రోడ్లను అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలతో కలసి ఆయన బుధవారం పరిశీలించారు. డీజే సౌండ్లు, సినిమా పాటలతో ప్రజలను ఇబ్బందిపెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మద్యం తాగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లే ఎస్వీనగర్, పద్మావతీనగర్, రాళ్లపల్లి సర్కిల్, ఎమ్మార్‌పల్లె, పూర్ణకుంభం సర్కిల్, లీలామహల్ సర్కిల్, వినాయకసాగర్ చెరువు, లింగాల చెరువులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఈ తనిఖీల్లో సీఐలు రామయ్య, ఎస్‌ఐ లోకేష్‌బాబు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలపై ఆరా తీస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



టవర్‌క్లాక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వాకర్స్ సభ్యులు, క్రీడాకారులు

గూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేని పక్షంలో నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం వాకర్స్ అసోసియేషన్, క్రీడాకారుల ఆధ్వర్యంలో స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియం నుంచి టవర్ క్లాక్ కేంద్రం వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రచారానికి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే ఈ అంశాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. గూడూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శర్మ, సుమన్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, సాయి, మునీఫ్, రాజా, శశిధర్, రజనీకాంత్, సందీప్, అగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై పోలీసుల జులుం

లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు


జీఎన్‌టీ మార్గంలో రోడ్డు పక్కన ఉన్న ఎర్రగడ్డలు విక్రయించే ఆటో - రోడ్డు అడ్డంగా ఉందని కేసు రాసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి ట్రక్కులు, ఆటోల్లో ఉల్లిపాయలు, తెల్లగడ్డలు, టమోటోలు, పండ్లు, కూరగాయలు తీసుకొచ్చి రోడ్డు పక్కనే బండ్లు పెట్టుకుని అమ్ముకునే చిరు వ్యాపారులపై పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి వ్యాపారాలు చేస్తున్నారని కేసులు రాస్తున్నారు. పుత్తూరు, పుంగనూరు, కల్లూరు, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి ట్రక్కులు, ఆటోల్లో ఎర్రగడ్డలు, కూరగాయలు తీసుకొచ్చి సూళ్లూరుపేట పట్టణంలో రోడ్డు పక్కన పెట్టుకుని అమ్ముకొంటుంటారు. వీరు వ్యాపారం చేసుకునేందుకు మున్సిపాలిటీకి రుసుం చెల్లిస్తారు. అయితే రోడ్డు అడ్డంగా బండ్లు పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నరంటూ వారం రోజుల నుంచి పోలీసులు కేసులు నమోదు చేస్తుండడంతో చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు. రోడ్డు పక్కన ఉన్నాం.. కదా సార్ అని వేడుకుంటున్నా పట్టించుకోవడంలేదు. పట్టణంలోని మార్కెట్‌లో ఉన్న బడా వ్యాపారులతో పోలీసులు కుమ్మక్కై వీధి వ్యాపారులపై కేసులు రాస్తురనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్డీఏ ప్రభుత్వంతో రాష్ట్రంలో సుపరిపాలన


కరపత్రాలు అంజేస్తున్న తానంకి నానాజీ తదితరులు

చిల్లకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిల్లకూరు మిక్సిడ్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తూ, అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, బెల్లకొండ రాజేంద్ర, నెల్లూరు రామ్మూర్తి, సోమశేఖర్, మల్లికార్జున్, నవీన్‌చంద్రా, రవి, బాలరమణయ్య, గున్నయ్య, రాధయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ స్థలాల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి అన్నారు. రెండో పట్టణ పరిధిలోని పోలయ్యగుంట ప్రాంతంలో ఉన్న కోదండ రామాంజనేయస్వామి ఆలయానికి చెందిన భూముల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో బుధవారం వాటిని తొలగించారు. కార్యక్రమంలో ఈవో రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు


ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దొమ్మరాజు సత్యనారాయణరాజు

పెళ్లకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోసనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక వేడుకలు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయశ్రీ, ఆమె భర్త పార్థసారథి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత దొమ్మరాజు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో విజయశ్రీ, పార్థసారథి దంపతులను సత్కరించి పట్టు వస్త్రాలు సమర్పించారు.

సీకాం డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

తిరుపతి(విద్య), ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): న్యూ మారుతీ నగర్‌లోని సీకాం డిగ్రీ కళాశాలకు అటానమస్ (స్వయంప్రతిపత్తి)హోదా లభించిందని ఛైర్మన్ డాక్టర్ టి. సురేంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కళాశాలకు న్యాక్ బీప్లస్ గ్రేడ్ ఉందని, ఇప్పుడు యూజీసీ ద్వారా అటానమస్ హోదా రావడం సంతోషంగా ఉందన్నారు. 1997లో కళాశాలఏర్పాటు చేశామన్నారు. పోటీప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. వివిధ అంశాలను పరిశీలించి స్వయంప్రతిపత్తి హోదాని ఇస్తూ యూజీసీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తిరుపతిలో ప్రథమంగా ఈహోదా తమ కళాశాలకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన డైరెక్టర్లు తేజస్వరూప్, ప్రణీత్‌స్వరూప్, అధ్యాపకులు, సిబ్బందిని కళాశాల అధ్యక్షురాలు బి.జయలక్ష్మి అభినందించారు.

జీలగ విత్తనాల పంపిణీ

వాకాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50శాతం సబ్సిడీతో జీలగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారిణి దీప తెలిపారు. బుధవారం వాకాడు సచివాలయ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జీలగ విత్తనాలు పంపిణీ చేశారు.

నేడు టీడీపీ సంస్థాగత ఎన్నికలు

తడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో పెళ్లకూరు, ఓజిలి, నాయుడుపేట మండల కన్వీనర్ ఎన్నికలు, మధ్యాహ్నం నాయుడుపేట పట్టణ కన్వీనర్ ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండల కన్వీనర్ల ఎన్నికలు, సాయంత్రం సూళ్లూరుపేట పట్టణ కన్వీనర్ ఎన్నికలు నిర్వహించనున్నారు. కొద్ది రోజులక్రితం కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్న పార్టీ అధిష్ఠానం గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఎన్నికల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొంటారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నా: పాశిం


పొదుపు సంఘాలకు రూ.31 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

కోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఇప్పటి వరకు గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండల పరిధిలోని కేశవరం పంచాయతీ రాఘవాపురం, సిద్దమ్మకండ్రిగ గ్రామాల్లో బుధవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా సిద్ధమ్మకండ్రిగలో జీవీఆర్ రొయ్యల పరిశ్రమ దాతృత్వంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామంలోని రెండు పొదుపు సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.31 లక్షల చెక్కును అందజేశారు. రాఘవాపురంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరించడంతో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, చిట్టేటి నాగూరయ్య, వరిదిగొల్ల కోటేశ్వర ప్రసాద్, భూపతి, పసుపులేటి వేణు, కసుమూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్ది రైతులు మన్ననలు పొందుతామని ఆయా సంఘం ఛైర్మన్లు అన్నారు. బుధవారం రాత్రి కోట మండలం చిట్టేడు సహకార సంఘ పాలకమండలి కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఛైర్మన్‌గా రాఘవాపురం గ్రామానికి చెందిన చాపల శ్రీనివాసులు, సభ్యులుగా డి.సతీష్, సీహెచ్ మధు చేత ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పారదర్శక పాలన అందించి ఉత్తమ ఛైర్మన్లుగా మన్ననలు పొందాలని సిద్దవరం, నెల్లూరుపల్లి కొత్తపాళెం, తిన్నెలపూడి సహకార సంఘ ఛైర్మన్లు పాదర్తి కోటేశ్వర్‌రెడ్డి, ఉచ్చూరు రవీంద్రనాథరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డిలను కోరారు. కార్యక్రమంలో చిట్టేడు సహకార సంఘ సీఈవో బండి కరుణాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామారావు, సూపర్‌వైజర్ చైతన్య కుమార్, ఊనుగుంటపాళెం, మల్లాం, గూడూరు, తిన్నెలపూడి సహకార సంఘాల సీఈవోలు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో పాటు స్థానికులకూ ఇళ్ల స్థలాలివ్వండి

గ్రామసభలో ఏకొల్లువాసుల వినతి



గ్రామసభలో స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు

దొరవారిసత్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సర్వే నెంబరు 44లో కళాకారులతో పాటు అర్హత కలిగిన స్థానికులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏకొల్లు గ్రామస్తులు విన్నవించారు. 1991, 1999లో 31మంది కళాకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ అప్పట్లో జాబితా రూపొందించారు. అయితే ఆ జాబిత ప్రకారం స్థలాల కేటాయింపు జరగలేదు. ఇటీవల ఆ ప్రాంతంలో ఆక్రమణలు ఎక్కువ కావడంతో స్థలాల కేటాయింపు చేయాలని కళాకారుల బృందం కలెక్టర్‌ను కోరింది. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు తహసీల్దారు శైలాకుమారి బుధవారం ఏకొల్లులో గ్రామసభ నిర్వహించించారు. కళాకారుల జాబితాను చదివి వినిపించారు. ఇందులో స్థానికులు ముగ్గురు మాత్రమే ఉండటం, మిగిలిన వారంతా బయటవారు, చనిపోయిన వారు ఉండటంతో స్థానికులు అభ్యంతరం చెప్పారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు ఏకొల్లులో చాలామంది ఉన్నారని, వారందరికీ ఆ ప్రాంతంలో స్థలం కేటాయించాలని మాజీ ఎంపీటీసీ బందిల ఉదయ్ తహసీల్దారును కోరారు. ఇదిలా ఉండగా సర్వే నెంబరు 44లో కొంత భూమి అటవీశాఖ పరిధిలో ఉందని ఆ శాఖ అధికారులు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇది రికార్డుల్లో రెవెన్యూ భూమిగానే ఉందని, సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతామని తహసీల్దారు చెప్పారు. గ్రామసభలో సర్పంచ్ బ్లెసీ, ఎస్ఐ అజయ్‌కుమార్, అటవీశాఖ ఎఫ్‌బీవో శ్రీనివాసులు, సర్వేయర్ నాగరాజు, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆదిముని, నాయకులు బందిల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మిత్ర పురుగుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వండి



క్షేత్ర సందర్శనలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

ఓజిలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరితో పాటు ఇతర పంటల సాగులో మిత్ర పురుగుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమలపూడి, కుందాం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శనతో పాటు పంటల సాగుపై అవగాహన, యాజమాన్య పద్ధతులను వివరించారు. ముఖ్యంగా వరి పైరు నాటిన 30-40 రోజుల వరకు పొలాల్లో పురుగు మందుల పిచికారీ చేయరాదన్నారు. మిత్ర పురుగులైన కందిరీగలు, సాలెపురుగులు, తూనీగలు, నీటి నల్లులు వంటివి బాగా అభివృద్ధి చెంది శత్రుపురుగులను అదుపులో ఉంచుతాయన్నారు. దీంతో పురుగుల మందుల వాడకంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గిపోతుందన్నారు. రైతులు వరి నాటిన 10-15 రోజులకే పురుగు మందుల పిచికారీ చేస్తున్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడి. ఎక్కువ లాభాల దిశగా పంటల సాగుపై దృష్టిపెట్టి తదనుగుణంగా మేలైన యాజమాన్య పద్ధతులపై దృష్టిపెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి డెన్‌దీప్, రైతులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ
నగదు జమకాని రైతులు పేర్లు నమోదు చేసుకోండి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. మండలంలోని కాపులూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించాలంటే రైతులు తమ పేర్లను ఆధార్ సీడింగ్ చేసుకోవడంతో పాటు జాయింట్ ఎల్‌పీఎంలను తొలగించుకోవాలని సూచించారు. వరి పంటపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏవో గణేష్ మాట్లాడుతూ కే-ఎన్ఎం 1638, ఎంటీజీవో 1010 రకాల పంటలకు కాండం ఎండు తెగులు ఎక్కువగా ఉంటే మైథిన్ మందు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు చెంగల్‌రాజు, భావన, రైతులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండలంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతులు తమ వివరాలను సచివాలయాల్లో వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లను సంప్రదించాలని ఏవో విజయలక్ష్మి సూచించారు. సరైన ధృవీకరణ పత్రాలు తీసుకెళ్లి వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లను సంప్రదిస్తే కారణాలు తెలపడంతో పాటు అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందన్నారు.

మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి సన్మానం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డిని టీడీపీ నాయకుడు నెలవల రాజేష్ సన్మానించారు. విజయవాడలో మంత్రిని నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన రాజేష్ శాలువాకప్పి సన్మానించారు.

దుకాణాల అద్దె సకాలంలో చెల్లించండి

నాయుడుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ దుకాణాల అద్దెలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. పట్టణంలో మున్సిపాలిటీకి చెందిన సీకేఎం కాంప్లెక్స్, ఎన్‌జేఆర్ కాంప్లెక్స్, ఇందిరమ్మ కాంప్లెక్స్, మార్కెట్ కాంప్లెక్స్‌లోని దుకాణ దారులతో అద్దెల బకాయిలపై బుధవారం మున్సిపల్ మేనేజర్ మాట్లాడారు. నిబంధనల ప్రకారం అద్దె చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది గాయత్రి, శ్రీనివాసులు ఉన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

సూళ్లూరుపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, సీహెచ్ జనార్దన్, గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, కృష్ణమూర్తి, కోశాధికారి చంద్రశేఖర్, గోవర్ధన్, సుబ్రహ్మణ్యం, మస్తాన్, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అరవపాళెం సచివాలయంలో
ప్రజా సమస్యలపై నేడు వినతుల స్వీకరణ

చిట్టమూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరవపాళెం సచివాలయంలో గురువారం ఉదయం 8గంటలకు ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అరవపాళెం, యల్లసిరి, పెద్ద దరఖాస్తు, చిన్న దరఖాస్తు, చింతలతోపు, బయ్యవారికండ్రిగ, పాటిమిట్ట గ్రామాల ప్రజలు సమస్యలను విన్నవిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

దంత వైద్యశిబిరం

గూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనియట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ఉదయం, రాత్రి తప్పనిసరిగా దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి, ప్రశాంతి, సౌజన్య, సంధ్యారాణి, శ్రీనివాసులు, మనీషా, డాక్టర్లు అరుణ, వంశీభరత్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దు

గూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం మానుకోవాలని వామపక్ష నాయకులు అన్నారు. బుధవారం స్థానిక అశోక్ నగర్‌లోని సచివాయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్‌చార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం విద్యుత్‌ను వాడుకుని తరువాత బిల్లులు చెల్లిస్తున్నా రన్నారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే ముందుగానే నగదు చెల్లించి కరెంటు వినియోగించుకోవాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, శశికుమార్, సీవీఆర్‌కుమార్, ప్రసాద్, చంద్రయ్య, మణి, మధు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెంకటగిరి, అగస్టు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 22మందికి ముఖ్యమంతి సహాయనిధి నుంచి రూ.13.75లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, మంకు ఆనంద్, పెరిమిడి మురళి తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

నేడు పలు రైళ్ల రద్దు

తడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో పొన్నేరి - కవర్‌పేట రైల్వే స్టేషన్‌ల మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న కారణంగా గురువారం గురువారం ఉదయం 11.10 నుంచి మధ్యాహ్నం 3.15 నిమిషాల వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037 రద్దు.
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10 గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9.00 ఈఎంయు లోకల్ రైళ్లు
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30,11.35, మధ్యాహ్నం 12.40గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 10.55 గంటలకు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఆవడికి రాత్రి 11.40 గంటలకు వచ్చే మెమూ రైలు
- చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55 నిమిషాలకు బయలుదేరే ఈఎంయూ లోకల్ రైలును మీజూరువరకు నడపనున్నారు.
- గుమ్మిడిపూడి నుంచి తాంబ్రంకు మధ్యాహ్నం 3.00గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలు మీజూరు నుంచి బయలుదేరి వెళ్లనుంది.

చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్, పొన్నేరి, మీజూరు మధ్య నడపనున్న ప్రత్యేక రైళ్ల వివరాలు...

- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరికి ఉదయం 10.30
- చెన్నై మోర్ మార్కెట్ నుంచి చెన్నైకు 11.35
- చెన్నై బీచ్ నుంచి పొన్నేరికి మధ్యాహ్నం 12.40
- పొన్నేరి నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.18, 3.33
- మీజూరు నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 2.59 నిమిషాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సీఐ ఏవీ రమణ అన్నారు. బుధవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైం, మానవత్వం, రోడ్డు భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్‌ను ఫ్యాషన్ కోసం వాడుతున్నారని, క్రమంగా వాటికి బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటారని అన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైం, మహిళల పట్ల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గారాబంతో మోటర్ సైకిల్‌ళ్లు ఇస్తున్నారని, నిబంధనలను అతిక్రమిస్తే శిక్షార్హులౌతారని అన్నారు.

దాడిలో మహిళకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దాడిలో మహిళకు గాయాలయ్యాయి. పట్టణంలోని లోతువానిగుంటలో నివాసం ఉంటున్న మేరమ్మను ఇంట్లో నుంచి వెళ్లిపోవాలంటూ కుటుంబ సభ్యులు బుధవారం దాడి చేశారు. గాయపడిన మేరమ్మను స్థానికులు నాయుడుపేట ప్రభుతాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఇటు ఎండ... అటు వర్షం

గూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కపోత తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. బుధవారం పట్టణంలో మధ్యాహ్నం 12:40 వరకు ఎండ కాసింది. వెంటనే వాతావరణంలో మార్పు చోటుచేసుకుని 15 నిమిషాలు పాటు మోస్తరు వర్షం కురిసింది. మళ్లీ ఎండ తీవ్రత పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు.

